

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | బుధవారం 23-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:42 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# రాజ్యసభ సమావేశాలను బహిష్కరించిన విపక్షం

## ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేసే వరకు సభకు రామన్న ఆజాద్
## ఎంపిల సస్పెన్షన్ ఎత్తేయాలన్న టిఆర్ఎస్

న్యూఢిల్లీ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ఆమోదింపచేసుకున్న వివాదాస్పద వ్యవసాయ బిల్లులు, ఎంపీల సస్పెన్షన్‌పై ప్రతిపక్ష పార్టీలు సంచలన నిర్ణయం తీసుకున్నాయి. బిల్లులను వెనక్కి తీసుకుని, ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యసభ నుంచి మూకుమ్మడిగా వాకౌట్ చేశాయి. తొలుత కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, టీఎంసీ, వామపక్షాలు వాకౌట్ చేయగా... కొద్ది సేపటికే ఎన్సీపీ, సమాజ్వాదీ పార్టీ, శివసేన, ఆర్జేడీ ఎంపీలు కూడా సభ నుంచి బయటికి వెళ్లిపోయారు. సభ నుంచి వాకౌట్ చేయవద్దనీ.. చర్చలో పాల్గొనాలంటూ చైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రతిపక్షాలు వెనక్కి తగ్గలేదు. కాగా అంతకు ముందు రాజ్యసభలో ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ఎనిమిది మంది ఎంపీలపై సస్పెన్షన్ ఎత్తివేసే వరకు సభా కార్యకలాపాలను ప్రతిపక్షాలు బహిష్కరిస్తాయని స్పష్టం చేశారు. మరోవైపు ప్రతిపక్షాలన్నీ మూకుమ్మడిగా రాజ్యసభ నుంచి వాకౌట్ చేసిన నేపథ్యంలో బహిష్కృత ఎంపీలు ధర్నా విరమించారు. మిగతా పార్లమెంటు సమావేశాలను ప్రతిపక్షాలన్నీ బహిష్కరించాయి. తాము కూడా సమావేశాలను బహిష్కరించినందున సస్పెండ్ అయిన ఎంపీలంతా ధర్నా విరమించాలంటూ వారు కోరారు. అందుకే మేము ధర్నా ముగిస్తున్నాం..అని కాంగ్రెస్ ఎంపీ సయ్యద్ నజీర్ హుస్సేన్ పేర్కొన్నారు. తాము కేవలం సస్పెన్షన్ ఎత్తివేయాలని మాత్రమే కోరడం లేదనీ... ఎలాంటి ఓటింగ్ లేకుండా ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ బిల్లులను కూడా వెనక్కి తీసుకోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. అగ్రికల్చర్ బిల్లులను వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ రాజ్యసభ సమావేశాలను బహిష్కరించింది. సభా కార్యక్రమాలపై ప్రతిష్టంభన నెలకొన్న నేపథ్యంలో.. మంగళవారం రాజ్యసభలో టీఆర్ఎస్ ఎంపీ కేశవరావు మాట్లాడారు. ఎంపీలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. పార్లమెంట్ ఆవరణలో దీక్ష చేపడుతున్న ఎంపీలకు మద్దతుగా రాజ్యసభ సమావేశాలను టీఆర్ఎస్ బహిష్కరించింది. వ్యవసాయ బిల్లుపై ఓటింగ్‌కు అనుమతి ఇవ్వకపోవడాన్ని వ్యతిరేస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఘటనను ఆయన గుర్తుచేస్తూ.. ఆ సంఘటనలను ఆయన ఖండిస్తున్నట్లు తెలిపారు. కేవలం సమయం పొడిగించాలని కోరినప్పుడే ఈ సంఘటన ఎందుకు జరిగిందని ఆయన ప్రశ్నించారు. రూల్ 252 అంశం గురించి ప్రస్తావిస్తూ.. పత్రికా కథనం పట్ల చాలా బ్యాడ్‌గా ఫీలవుతున్నట్లు తెలిపారు. 252 సీ రూల్ ప్రకారం డివిజన్ కోసం 3 నిమిషాల సమయం ఇవ్వాలని, కానీ అలా చేయలేదన్నారు. టీఆర్ఎస్‌తో పాటు రాజ్యసభలోని విపక్ష పార్టీలన్నీ సెస్షన్‌ను బహిష్కరించాయి. కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, శివసేన, వామపక్ష, ఆప్ పార్టీలు కూడా సమావేశాలను బహిష్కరిస్తున్నాయి. 8 మంది సభ్యులపై సస్పెన్షన్ ఎత్తివేసే వరకు తాము సభను బయ్‌కాట్ చేయనున్నట్లు ఆజాద్ తెలిపారు. స్వామినాథన్ ఫార్ములా ప్రకారం కనీస మద్దతు ధరను ఫిక్స్ చేయాలన్నారు.

# ఆమ్ ఆద్మీ సర్కార్ నిర్ణయంపై హైకోర్టు స్టే

న్యూఢిల్లీ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వానికి అక్కడి హైకోర్టులో చుక్కెదురైంది. కరోనా వైరస్ విస్తరణ నేపథ్యంలో 80 శాతం ఐసీయూ పడకలను కొవిడ్-19 రోగుల కోసం రిజర్వ్ చేయాలని సూచిస్తూ.. అరవింద్ కేజ్రివాల్ ప్రభుత్వం ఇటీవల ప్రైవేటు ఆస్పత్రులకు ఇచ్చిన ఆదేశాలపై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈ కేసులో తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఢిల్లీ ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రైవేటు ఆస్పత్రులు హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది.

# కరోనా తీవ్ర ఉన్న రాష్ట్రాల సిఎంలతో ప్రధాని సమీక్ష

## ఎపి తదితర రాష్ట్రాలతో నేడు సమీక్షించనున్న మోడీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): కరోనాపై చాలా రోజుల తరవాత మరోమారు ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాల సిఎంలతో మాట్లాడనున్నారు. కరోనా ప్రభావం తీవ్రంగా ఉన్న ఏడు రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో బుధవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగనున్న ఈ సమావేశంలో ముఖ్యమంత్రులతోపాటు ఆ ఏడు రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు కూడా పాల్గొననున్నారు. ఆయా రాష్ట్రాల్లో కరోనా మహమ్మారి విస్తరిస్తున్న తీరు, ఆ వైరస్‌ను అరికట్టడానికి చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. కరోనా విస్తృతి ఎక్కువగా ఉన్న వాటిలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఢిల్లీ, పంజాబ్ ఉన్నాయి.

ఈ ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆరోగ్యమంత్రులతో ప్రధాని మోదీ సెప్టెంబర్ 23న ఉన్నతస్థాయి భేటీ నిర్వహించనున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

# అమల్లోకి రెవెన్యూ నూతన చట్టం

## ఆమోద ముద్ర వేసిన గవర్నర్ తమిళ సై
## గెజిట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్,సెప్టెంబర్22 (ఆర్ఎన్ఎ): తెలంగాణలో కొత్త రెవెన్యూ చట్టం అమల్లోకి వచ్చింది. ఈ రెవెన్యూ విధానంలో భాగంగా భూమి హక్కులు-పట్టాదారు పాస్ పుస్తకాల చట్టంతో పాటు వీఆర్వో పోస్టుల రద్దు చట్టాలు అమల్లోకి వచ్చాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో శాసనసభ, మండలిలో బిల్లుకు ఆమోదం లభించిన విషయం విదితమే. ఈ బిల్లును గవర్నర్ తమిళసై సౌందర్ రాజన్ ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. దీంతో బిల్లులు చట్ట రూపం దాల్చాయి. వీఆర్ఓ పోస్టుల రద్దు, టీఎస్ బీపాస్ చట్టాలు, పురపాలక, పంచాయతీరాజ్, ప్రైవేట్ వర్సిటీ, జీఎస్టీ సవరణ చట్టాలు అమల్లోకి వచ్చాయని ఇందుకు సంబంధించిన ఉత్వర్వులను న్యాయశాఖ జారీ చేసింది. తాజా ఉత్వర్వులతో ఈ బిల్లులన్నీ అధికారికంగా అమల్లోకి రానున్నాయి. కాగా.. నూతన రెవెన్యూ చట్టానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టడంతో తెలంగాణలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఇన్నేళ్ల పాటు భూ సమస్యలతో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఇక మా కష్టాలు తీరినట్లేనని సంబురాలు జరుపుకుంటున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సీఎంకు మద్దతుగా పలువురు రైతులు, టీఆర్ఎస్ కార్యకర్తలు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు.



రెవెన్యూ చట్టం అమల్లోకి రావడంతో పలు ప్రాంతాల్లో రైతుల ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో ర్యాలీలు తీసి, పాదయాత్రలు చేసి సంబురాలు చేసుకున్న టిఆర్ఎస్ శ్రేణులు

# మరోమారు ఆందోళన బాటలో గాంధీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): గాంధీ ఆసుపత్రి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది మరోసారి విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. జీతాలు పెంచినట్లు చెప్పిన ప్రభుత్వం మూడు నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని సిబ్బంది ఆరోపిస్తున్నారు. పెంచిన జీతాలు, కరోనా స్పెషల్ అలవెన్స్‌ను వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పేషంట్ కేర్, ఔట్ సోర్సింగ్, సెక్యూరిటీ, పారిశుద్ధ్య కార్మికులు ఆసుపత్రి ఆవరణలోనే బైటాయించి నిరసన చేపట్టారు.

# క్షమాపణలు చెబితే సస్పెన్షన్ ఉపసంహారణ

## రాజ్యసభలో ఆ 8 మంది సభ్యుల తీరు అభ్యంతరకరం
## ఛైర్మన్ నిర్ణయం సరైనదే అన్న కేంద్రమంత్రి రవిశంకర్

న్యూఢిల్లీ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): వ్యవసాయ బిల్లుల ఆమోదం సందర్భంగా రాజ్యసభలో సస్పెన్షన్‌కు గురైన ఎనిమిది మంది సభ్యులు క్షమాపణ కోరితే వారిపై సస్పెన్షన్ వేటును ఉపసంహరించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఎనిమిది మంది సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు రాజ్యసభ నుంచి మంగళవారం వాకౌట్ చేసిన నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. విపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ తొలుత సభ నుంచి వాకౌట్ చేయగా, ఆపై ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు వాకౌట్ చేశాయి. రాజ్యసభలో తమ ప్రవర్తనపై సస్పెన్షన్‌కు గురైన సభ్యులు క్షమాపణ కోరితే ప్రభుత్వం వారిపై సానుకూల నిర్ణయం తీసుకుంటుందని రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. రాజ్యసభలో విపక్షాల అనుచిత ప్రవర్తనను కాంగ్రెస్ వ్యతిరేకిస్తుందని తాము భావించామని చెప్పారు. విదేశాల నుంచి వచ్చిన ట్వీట్‌కు అనుగుణంగా ఎంపీలు ఇలా ప్రవర్తించడం ఏ తరహా రాజకీయమని ఆయన రాహుల్ ట్వీట్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. తన తల్లి సోనియా గాంధీ ఆరోగ్య పరీక్షల కోసం రాహుల్ ఆమె వెంట విదేశీ పర్యటనలో పాల్గొన్న విషయం తెలిసిందే. రాజ్యసభ టేబుల్‌పైకి ఎక్కి నృత్యం చేస్తూ కాగితాలను చించివేసిన కాంగ్రెస్ ఎంపీని తాము ఇంతవరకూ చూడలేదని కేంద్ర మంత్రి ఆక్షేపించారు. రాజ్యసభలో వ్యవసాయ బిల్లులు ఆమోదం పొందేందుకు ప్రభుత్వానికి స్పష్టమైన మెజారిటీ ఉందని చెప్పారు. కాగా, వ్యవసాయ బిల్లుల ఆమోదం? సందర్భంగా ఆదివారం రాజ్యసభలో విపక్షాలు ఆందోళనకు దిగడంతో తీవ్ర గందరగోళం నెలకొంది.

# పట్టభద్ర ఎమ్మెల్సీలో విజయం సాధిస్తాం: ఎర్రబెల్లి

హైదరాబాద్,సెప్టెంబర్22 (ఆర్ఎన్ఎ): నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రులు తమ ఓటును టిఆర్ఎస్‌కు వేస్తారని అన్నారు. ప్రతి కార్యకర్త టీఆర్ఎస్ గెలుపుకోసం శ్రమించాలని పిలుపునిచ్చారు. 2017 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీ లు టీఆర్ఎస్‌కు పోటీయే కాదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# టీఆర్ఎస్ మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం : మంత్రి ఈశ్వర్

జగిత్యాల, సెప్టెంబర్ 22: టీఆర్ఎస్ మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జిల్లా పెగడపల్లి మండలం ఆరవెల్లి, దోమలకుంట, శాలపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రోడ్లు, కుల సంఘ భవనాలు, వైకుంఠం ధామం, దోమలకుంట గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణానికి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శాలపల్లి గ్రామంలో పల్లె ప్రగతి వనం, డంపింగ్ యాడ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ పేదల సంక్షేమానికి పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ ఓరుగంటి రమణారావు, జట్పీటీసీ కాసుకంటి రాజేందర్, ఎంపీపీ గోళి శోభ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారికి శ్రీవిల్లిపుత్తూరు మాలలు

## -ప్రత్యేక పూజలతో నడుమ గరుడ సేవకు వినియోగం

తిరుమల,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుండి గోదాదేవి మాలలు మంగళవారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రీ పెద్దజీయంగార్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. అక్కడ పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుంచి టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోదాదేవి మాలలను శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. అంతకుముందు ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి అలంకరించిన మాలలను గరుడసేవ రోజు స్వామి వారికి అలంకరించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. శ్రీవిల్లిపుత్తూరులోని శ్రీరంగమన్నార్‌స్వామివారి ఆలయానికి గోదాదేవి తండ్రి శ్రీపెరియాళ్వార్ పుష్పకైంకర్యం చేసేవారని, రంగనాథునిపై అనన్యభక్తి కలిగిన శ్రీ గోదాదేవి పూలమాలలను మొదట తాను ధరించి ఆ తరువాత స్వామివారికి పంపేదని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన పెరియాళ్వార్ తన కుమార్తెను మందలించారని, ఆ తరువాత గోదాదేవి ధరించకుండా పంపిన మాలలను శ్రీరంగనాథుడు తిరస్కరించినట్టు చెప్పారు. గోదాదేవి శ్రీవారి దేవేరి అయిన భూదేవి అవతారమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు బోర్డు సభ్యులు డిపి.అనంత, శేఖర్‌రెడ్డి, గోవిందహరి, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ జాయింట్ కమిషనర్ ధనపాల్ రవిచంద్ర, ఈవో ఇలంగోవన్ పాల్గొన్నారు.

శ్రీవారికి స్నపన తిరుంజనం

ఇదిలావుంటే మొదటి సారిగా కివిఫ్రూట్, నెమలి ఈకల మాలలు, కిరీటాలతో శాస్త్రోక్తంగా శ్రీవారికి స్నపనతిరుమంజనం నిర్వ హించారు.

# నూతన రెవెన్యూ చట్టంపై రైతుల్లో ఆనందం

## -ఊరూరా ట్రాక్టర్లతో ర్యాలీ తీసిన అన్నదాతలు

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ తీసుకు వచ్చిన నూతన రెవెన్యూ చట్టంపై అన్నివర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతున్నది. సంబురాల పర్వం కొనసాగుతూనే ఉంది. రైతులు స్వచ్ఛందంగా ముందుకొస్తూ ఊరూరా జోరుగా ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సీఎం కేసీఆర్‌కు తమ సంపూర్ణ మద్దతను ప్రకటిస్తున్నారు. నూతన రెవెన్యూ చట్టానికి మద్దతుగా మెదక్ పట్టణంలో రైతులు భారీ ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, పార్టీ శ్రేణులు, ప్రజలు, రైతులు హాజరయ్యారు. అలాగే వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి రైతులకు మేలు చేయడంతో సీఎం కేసీఆర్ కు సంఘీభావం తెలుపుతూ జిల్లాలోని సూర్యాపేట జిల్లాలోని మద్దిరాల మండల కేంద్రంలో రైతు బంధు సమితి జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్ఎ రజాక్ ఆద్వర్యంలో 130 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మోత్కుర్, అడ్డ గూడూరులలో రైతులు టీఆర్ఎస్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ భద్మశ్రీ యొసగుచు మొదటి
"పద్మశ్రీ"నందుకున్న ప్రతిభామూర్తిన్
పద్మదళాక్షుని... నటునా
సద్మమ్మున గెంచి కొలుతు "స్థానము" వారిన!!

( సెప్టెంబర్ 22 స్థానం నరసింహారావు జయంతి..)



-రాధశ్రీ
సెల్: 9494481210




# విపక్షాల ఐక్యతకు ఇదే సమయం

నేటి నిజం
బుధవారం 23-9-2020

దేశ రాజకీయాల్లో ఇప్పుడు బిజెపిని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. తాజాగా వ్యవసాయ బిల్లుల అంశం కలసి వస్తోంది. ఈ బిల్లులను విపక్ష పార్టీలు వ్యతిరేకించగా..ఎన్‌డిఎ మిత్రపక్షం అకాలీదళ్ కూడా వ్యతిరేకించింది. అలాగే కూటమి నుంచి వైదొలగింది. తెలంగాణలో కెసిఆర్ నేతృత్వంలోటిఆర్ఎస్ కూడా వ్యవసాయ బిల్లులను వ్యతిరేకించింది. సమాఖ్య స్ఫూర్తికి వ్యవసాయ బిల్లులు, రాబోయే విద్యుత్ బిల్లు విఘాతం కలిగిస్తుందని విపక్ష పార్టీలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఇకపోతే ఇది రైతల మెడపై కత్తిలాంటిదని, తేనెపూసిన కత్తి అని కెసిఆర్ విమర్శలు గుప్పించారు. ఎపిలో వైకాపా పెద్దగా దీనికి వెళ్లడం లేదు. ఇకపోతే విద్యుత్, వ్యవసాయ బిల్లులు విపక్ష పార్టీలకు అందివచ్చే అంశాలుగా చూడాలి. ఓ రకంగా పోరాటానికి ఈ రెండూ ఆయుధాలుగా పనికి వస్తాయి. టిఆర్ఎస్ ఈ రెండు అంశాలపై బాగా ఫోకస్ పెట్టిందనే చెప్పాలి. విద్యుత్ మీటర్ల బిగింపును ఇప్పటికే వ్యతిరేకించిన టిఆర్ఎస్..అసెంబ్లీలో దీనికి వ్యతిరేకంగా తీర్మానం కూడా చేసింది. ఎపిలో మాత్రం విద్యుత్ మీటర్ల బిగింపును ప్రభుత్వమే ముందుకు తీసుకుని వెళుతోంది. వ్యవసాయం రాష్ట్రాల స్జబెక్టు అయినా వాటిని సంప్రదించకుండా ఆర్డినెన్స్‌లు తేవడం సమాఖ్య వ్యవస్థకు విఘాతం అని విపక్షాలు ముక్తకంఠంతో నినదిస్తున్నాయి. బిల్లులపై చర్చ సమయంలోనూ ప్రతిపక్షాల అభ్యంతరాలను కేంద్రం ఖాతరు చేయలేదని మండిపడుతున్నాయి. బిల్లు ఆమోదం పొందిన తీరు ప్రజాస్వామ్యయుతంగా లేదని, ఛైర్మన్ వెంకయ్య నాయుడు, ఎనిమిది మంది విపక్ష సభ్యుల పై సస్పెన్షన్ వేటు వేయడం అన్యాయ మని విపక్షాలు ముక్త కంఠంతో ఖండిస్తున్నాయి. వ్యవసాయ బిల్లులు రెండూ ప్రధాని మోడీ చెబుతున్నట్లు రైతులకు స్వేచ్ఛను కల్పించవు. రైతులను కార్పొరేట్లకు, పెట్టుబడి దారులకు బానిసలుగా మారుస్తాయి. కాంట్రాక్టు, కంపెనీ సేద్యం దూకుడు పెంచుతాయి. రైతులకు ఇప్పుడు దక్కుతున్న కనీస మద్దతుధర దక్కదు. ఆహార భద్రతకు ముప్పు తెస్తాయి. వ్యవసాయ రంగానికి, రైతులకు, ప్రజలకు నష్టం చేసే బిల్లుల ను కేంద్రం మంకు పట్టుదలతో తేవడానికి వెనుక కార్పొరేట్ల ఆశ్రితపక్షపాతం కనిపిస్తోందని విపక్షాలతో పాటు టిఆర్ఎస్ కూడా విమర్శలకు దిగింది. అయితే ఈ బిల్లులకు ఎపిలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి బేషరతుగా మద్దతివ్వడం గమనార్హం. తెలంగాణకు చెందిన టిఆర్ఎస్ మాత్రం వ్యతిరేకించింది. తమది రైతు ప్రభుత్వమని చెబుతున్న వైసిపి...కేంద్రంలో బిజెపితో అంటకాగేందుకు, రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టేందుకు వెనుకాడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రాష్ట్రాల హక్కులను, రైతులను నట్టేట ముంచే బిల్లులపై మద్దతివ్వడం దారుణం. ఉచిత విద్యుత్ మీటర్ల విషయంలోనూ వైకాపా అందరి కంటే ముందు నిలిచింది. రైతులకు వైసిపి ద్రోహం చేస్తోందంటూ హూంకరించే టిడిపి సైతం పార్లమెంట్‌లో బిల్లులకు జైకొట్టడం గమనార్హం. జాతికి అన్నం పెట్టే రైతులను కన్నీరు పెట్టించే రాజ్యాంగ వ్యతిరేక చట్టాలను రైతులు, ప్రజలందరూ తిప్పి కొట్టాలన్న డిమాండ్ వస్తోంది. అయితే ప్రధాని మాత్రం విపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని, రైతుల ప్రయజనాలను దెబ్బతీస్తున్నారని విమర్శలను ఖండించారు. మొత్తంగా ఇప్పుడు జాతీయ రాజకీయాల గురించి ఆలోచన చేస్తున్న తెలంగాణ సిఎం కెఇసార్‌కు ఇదికూడా కలసి వచ్చేలా ఉంది. జమిలి ఎన్నికలను నిర్వహించి.. అధ్యక్ష పాలనకు బిజెపి పావులు కదుపుతోందన్న వార్తలు వస్తున్నాయి. అదే జరిగితే లోక్‌సభ ఎన్నికల్లో కేవలం జాతీయ పార్టీలే పోటీ చేసే అవకాశం ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికలకే ప్రాంతీయ పార్టీలు పరిమితం కావాల్సి ఉంటుంది. అందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ పార్టీ ద్వారా కేంద్ర రాజకీయాల్లోకి అడుగుపెట్టే ఆలోచనలో ఉన్నారు. అందుకే విద్యుత్,రైతు బిల్లులను నిర్మొహమాటంగా వ్యతిరేకించారు.

ఇందులో భాగంగానే ఇటీవల బిజెపి, మోడీ లక్ష్యంగా విమర్శలకు పదును పెట్టారు. టిఆర్ఎస్ శ్రేణులు కూడా అదేపనిలో ఉన్నారు. దేశం గురించి మాట్లాడడానికి కేసీఆర్ వెనకాడడం లేదు. తెలంగాణను బాగా అభివృద్ధిచేశాని, ఇక దేశం సమస్యలు తేలుస్తాని అంటున్నారు. జాతీయ పార్టీలుగా పాలన చేసిన బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ప్రజల అవసరాలు గుర్తించడంలో విఫలమయ్యాయని పదేపదే విమర్శిస్తున్నారు. భారతీయ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయమే అత్యంత కీలకం. మన దేశం నుంచి ఎగుమతి చేసే విధానం రావాలని, దేశాన్ని పంట కాలనీలుగా విభజించాలని, పంటల మార్పిడి విధానం పాటించాలని కెసిఆర్ ఈ మధ్య కాలంలో జాతీయ అంశంగా వ్యవసాయాన్ని తీసుకుంటు న్నారు. వ్యవసాయం, నీటి వినియోగంపై బాగా మాట్లాడుతున్నారు. దేశంలో 70 వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉంది. 40 కోట్ల ఎకరాలు సాగవుతున్నాయని అనుకున్నా.. ఇంకా 30 వేల టీఎంసీల నీరు మిగులు ఉంటుంది. ఈ విషయాలు నేను చెప్పినా ప్రధాని మోదీ పట్టించు కోవడం లేదని పలు సందర్భా ల్లో కేసీఆర్ వ్యాఖ్యలు చేశారు. మొత్తంగా జాతీయ రాజకీయాల్లో అడుగు పెట్టాలని కెసిఆర్ దాదాపుగా నిర్ణయానికి వచ్చారని ప్రచారం సాగుతోంది. బీజేపీ అధ్యక్ష రాజకీయాలను అడ్డుకునేందుకు జాతీయ పార్టీ ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. బీజేపీ ఇప్పటికే 'ఒకే దేశం.. ఒకే విధానం' పేరిట అడుగులు వేస్తోంది. ఈ నినాదంతోనే జమిలి ఎన్నికలకు వెళ్లడానికి పావులు కదుపుతోంది. ఆ ఎన్నికల్లో ఎక్కువ రాష్ట్రాల్లో గెలిచి.. రాజ్యాంగ సవరణ ద్వారా అధ్యక్ష తరహా పాలనకు తెరతీయాలని భావిస్తోందని రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని పసిగట్టిన కేసీఆర్.. బీజేపీ నినాదానికి అడ్డుకట్ట వేయడమే కాకుండా జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలవడానికి పావులు కదుపుతున్నారని తాజా పరిణామాలను గమనిస్తే తెలుస్తోంది. అయితే, సొంతంగా పార్టీని ఏర్పాటు చేస్తారా? లేక కలిసి వచ్చే ఇతర ప్రాంతీయ పార్టీలను కూడా కలుపుకొంటారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ మేరకు బీజేపీ యేతర ప్రభుత్వాల సీఎంలతో కేసీఆర్ ఇప్పటికే మంతనాలు జరుపుతున్నారని తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, జార్ఖండ్ సీఎం, జేఎంఎం నేత హేమంత్ సోరెన్ వంటి నేతలతో చర్చలు జరిపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తాజాగా వ్యవసాయ బిల్లుల కారణంగా అన్ని పార్టీలు అసంతృప్తిగా ఉన్నాయి. అయితే కాంగ్రెస్ విపక్ష పార్టీగా విఫలం కావడం కూడా కలసి వచ్చే అంశం. వ్యవసాయ బిల్లులు, రానున్న విద్యుత్ బిల్లు కూడా ఆయుధాలుగా కెసిఆర్ రంగంలోకి దిగితే ఎన్ని పార్టీలు కలసి వస్తాయో చూడాలి. తెలంగాణ ఉద్యమానికి ముందు కూడా కెసిఆర్ విద్యుత్ బిల్లుల సమస్యతోనే రంగంలోకి దూకి తెలంగాణ సాకారం చేయడంలో విజయం సాధించారు. ఇప్పటికీ ఆయన జాతీయ రాజకీయాల్లో విజయం సాధిస్తామన్న ధీమాతో ఉన్నారు.

## నయా జమీందార్ వ్యవస్థకు తెరతీసిన బిజెపి

**ఓటుతో దుబ్బాకలో బిజెపికి బుద్ధి చెప్పాలి**

**రైతులకు టిఆర్ఎస్‌తోనే ధైర్యం వచ్చింది**

**కేంద్రం మీటర్లు పెట్టి రైతులపై భారం మోపాలని చూస్తోంది**

**-దుబ్బాక పర్యటనలో మంత్రి హరీష్ రావు**

సిద్దిపేట,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): బడా కార్పొరేట్ ముసుగులో నయా జమీందారు వ్యవస్థకు తెరలేపుతున్న బీజేపీకి దుబ్బాక ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. సిఎం కెసిఆర్ ఓవైపు రైతులను రాజు చేయాలని చూస్తుంటే కేంద్రం వారి నడ్డి విరిచే ప్రయత్నాలు మొదలు పెట్టిందని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం పద్మనాభునిపల్లి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. తనను అసెంబ్లీకి పంపడంలో మొదటి చెయ్యి పద్మనాభునిపల్లె గ్రామస్తులదేనని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పద్మనాబంపల్లి గ్రామస్థులు టీఆర్ఎస్‌కే ఓటేస్తామని కుల సంఘాల వారీగా ఏకగ్రీవ తీర్మాన పత్రాలను మంత్రి హరీష్‌రావుకు అందించారు. తమ ఓటు టీఆర్ఎస్ పార్టీకే అంటూ పద్మనాభునిపల్లి గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆ ప్రతులను గ్రామ సర్పంచ్ పర్శరాములు, పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావుకు అందజేశారు. వీరితోపాటు గ్రామంలోని అన్ని కుల సంఘాలు తమ మద్దత్తు తెలుపుతూ తీర్మాన పత్రాలను మంత్రికి అందజేశాయి. తమ ఓటు కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీకేనని ముక్తకంఠంతో చెప్పిన గ్రామస్తులకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రైతుకు ధైర్యం వచ్చింది టీఆర్ఎస్ ప్రభుత్వం వల్లేనని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులపై రెండు వైపులా కత్తిలాగా బీజేపీ బిల్లు తెచ్చిందని అన్నారు. మార్కెట్ యార్డులను రద్దు చేస్తామని.. కొత్త బిల్లు ప్రవేశ పెడుతున్న బీజేపీకి దుబ్బాక ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. తెలంగాణకు కేంద్రం రూ.2,500 కోట్ల నిధులు ఇచ్చి బోరుబావుల దగ్గర మీటర్లు పెట్టమంటే తిప్పికొట్టా మన్నారు. ఏపీకి రూ.4 వేల కోట్లు ఇస్తామంటే జగన్ ఒప్పుకొని మీటర్లు పెడుతున్నారని మంత్రి హరీష్‌రావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అన్నీ మెరుగుపరుచుకున్నామని హరీశ్‌రావు అన్నారు. ఇంటింటికీ తాగునీరు, ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే టీఆర్ఎస్ పార్టీ నినాదమన్నారు. కాలంతో పని లేకుండా కాళేశ్వరం నీళ్లతో పద్మనాభునిపల్లె చెరువు నిండే ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలో ఏడాది కిందటే మద్య నిషేధం చేసిన గ్రామస్తులను, యువతను అభినందిస్తున్నానని చెప్పారు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేస్తూ.. మార్కెట్లను రద్దు చేసేందుకు చూస్తున్న బీజేపీ డిపాజిట్లు గల్లంతయ్యేలా దుబ్బాక ప్రజలు తీర్పు చెప్పాలని కోరారు. అంతకు ముందు ఎల్లమ్మ దేవాలయంలో హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ మహిళలు మంగళహారతులు పట్టి, కుంకుమ తిలకం దిద్దారు. గ్రామస్తులు బోనాలతో తరలివచ్చి, పటాకలు కాల్చి, డప్పు చప్పుళ్లతో అడుగడుగునా మంత్రికి ఘన స్వాగతం పలికారు.

## తెలంగాణ టిడిపిలో అసంతృప్తి

**-అధ్యక్ష పదవి నుంచి రమణను మార్చాలని డిమాండ్**

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): తెలంగాణ తెలుగుదేశం పార్టీలో అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. ప్రస్తుతం టీటీడీపీ అధ్యక్షుడుగా ఉన్న ఎల్.రమణ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలు తిరుగుబాటుకు ఉపక్రమించారు. తెలంగాణ పార్టీ నాయకత్వ మార్పు కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. గత ఏడేళ్లుగా ఒకే వ్యక్తి అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారని, రాష్ట్రంలో పార్టీ ఉనికి ఆందోళనలో పడిందని, ఇప్పటికైనా అధ్యక్షుడిని మార్చాలంటూ విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో టీడీపీ పరిస్థితిని వివరిస్తూ, కింది స్థాయి కార్యకర్త నుంచి పార్లమెంటు ఇంఛార్జి, కోర్ కమిటీ వరకు ఈ మేరకు తమ డిమాండ్లు తెలుపుతూ లేఖ రాశారు. కాగా ఇప్పటి వరకు రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల్లోనూ టీడీపీ ఘోరంగా విఫలమైన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన సమయంలో రెండు కళ్ల సిద్ధాంతాన్ని అవలంబించిన చంద్రబాబు విధానంతో, పార్టీ నుంచి వలసలే తప్ప, చెప్పుకోదగ్గ స్థాయిలో కొత్తగా ఎవరూ పార్టీలో చేరిన దాఖలాలు లేవు. అంతేగాక ప్రతీ ఎన్నికల్లోనూ ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకునే చంద్రబాబు, గత ఎన్నికల్లో ఏకంగా కాంగ్రెస్ పార్టీతో జట్టుకట్టడంతో టీడీపీ మద్దతుదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే.

## కులవృత్తులను ఆదుకున్న కెసిఆర్

**వారి జీవితాల్లో వెలుగులు నింపారు: శ్రీనివాసగౌడ్**

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కుల వృత్తులకు ప్రోత్సాహం అందించి పూర్వ వైభవం తీసుకవచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారని ఆబ్కారి శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అలాగే చేవెళ్ల మండలంలోని కందవాడ గ్రామంలో ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ కు హరితహారం కార్యక్రమంలో పాల్గొని తాటి, ఈత మొక్కలను కూడా మంత్రి శ్రీనివాస్ గౌడ్ నాటారు. అనంతరం చేవెళ్ల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన స్టేషన్ ను మంత్రి సబిత ఇంద్రారెడ్డితో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ కు హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలో 3 కోట్ల 75 లక్షల తాటి, ఈత మొక్కలను నాటామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 2 వేల మొక్కలు ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలో నాటుతున్నామన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం నీరా పాలసీని ప్రవేశపెట్టామని మంత్రి తెలిపారు. ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 98 ఆబ్కారి స్టేషన్లుకు నూతన భవనాల నిర్మాణం చేస్తున్నామన్నరు. ఇప్పటికే సుమారు 48 స్టేషన్ల నూతన భవనాల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వాటిలో 14 స్టేషన్లు ను ప్రారంభించామన్నారు. రంగారెడ్డి జిల్లాలో తొలి ఆబ్కారి శాఖ స్టేషన్ నిర్మాణలన్నీ చేవెళ్ల లో నేడు ప్రారంభించామన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గారి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రం గుడుంబా రహిత రాష్ట్రం గా తీర్చిదిద్దుతున్నామన్నారు.

# టీఆర్ఎస్ రాజకీయ దూకుడు

**రాష్ట్ర రాజకీయాలపై కెటిఆర్ పట్టు**

**జాతీయ రాజకీయ పరిణామాలపై కెసిఆర్ దృష్టి**

హైదరాబాద్,సెప్టెంబర్22 (ఆంఎన్ఎ): ఎమ్మెల్సీ ఎన్నికలపై టిఆర్ఎస్ దూకుడు పెంచింది. రానున్న పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టిఆర్ఎస్ గతంలో ఎప్పుడూ లేనంతగా దృష్టి సారించది. అలాగే ఓటరు నమోదు మొదలు గెలుపు వరకు వ్యూహాత్మకంగా అడుగుల వేసేలా పార్టీ శ్రేణులను మంత్రి, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ దిశానిర్దేశం చేస్తున్నారు.

అలాగే గ్రేటర్, హైదరాబాద్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలపైనా చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఓ వైపు రాష్ట్రంలో ఎన్ఇనకలపై కెటిఆర్, జాతీయ రాజకయిలపై కెసిఆర్ దృష్టి సారించారనే చెప్పాలి. 'కారు.. సారు.. పదహారు' నినాదంతో గత లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ ప్రచారం సాగించిన టిఆర్ఎస్ ఇప్పుడు ఎన్నిక ఏదైనా గెలుపు టిఆర్ఎస్‌దే అన్న నినాదంతో ముందుకు సాగుతోంది. అప్పట్లోనే తన జాతీయ ఆకాంక్షలను సీఎం కేసీఆర్ సుస్పష్టంగా వెల్లడించారు. పాకిస్థాన్‌ను నియంత్రించడంలో, జాతీయ భద్రతను కాపాడడంలో, అంతర్జాతీయ సంబంధాల్లో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. తెలంగాణలో విజయవంతంగా అమలు చేసిన విద్యుత్తు, సాగునీటి విధానాల్లో కేంద్రంలోని ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. 2,21,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉన్నా.. 1,80,000 మెగావాట్లను మాత్రమే దేశం వినియోగించుకుంటోందని, సగం దేశం చీకట్లో మగ్గుతోందని ఆరోపించారు.

మిగులు విద్యుత్‌ను కూడా వినియోగించుకోలేని దౌర్భాగ్యంలో ఉన్నామని అంటున్నారు. దేశంలో 70 వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నాయని, కానీ, సాగునీటిని పూర్తిగా వినియోగించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలతో కలిసి ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తానని గతంలోనే ప్రకటించిన కెసిఆర్ ఇప్పుడు తాజా రాజకీయల నేపథ్యంలో మరోమారు చురుకుగా వ్యవహరించడం ద్వారా జాతీయ రాజకీయాలపై ఫోకస్ పెట్టారు. అవసరమైతే జాతీయ పార్టీ పెడతానని అప్పట్లోనే వెల్లడించారు. చెన్నై వెళ్లి స్టాలిన్, కోల్‌కతా వెళ్లి మమతా బెనర్జీ వంటి వారితో మంతనాలు కూడా జరిపారు.

కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వస్తే ఉప ప్రధాని పదవి కోరాలంటూ యోచనలు సాగాయని అప్పట్లో పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. కేసీఆర్ ప్రధాని అయితే తప్పేంటి అంటూ ఆయన తనయ కవిత సహా టీఆర్ఎస్ నేతలు ప్రకటనలు చేశారు. కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళతారనే ప్రచారమూ నేటికీ జరుగుతోంది. కెటిఆర్ సిఎం కావాలన్న డిమాండ్ పార్టీలో రావడం వెనక వ్యూహం కూడా ఇదే అయి ఉంటుంది. అయితే, కేంద్రంలో బీజేపీ నేతృత్వంలో పూర్తి మెజారిటీ ఉన్న ప్రభుత్వం రావడంతో కేసీఆర్ అడుగులు ముందుకు పడలేదు. ఇటీవలి కాలంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు మండిపడుతున్నారు. జీఎస్టీ పరిహారం ఇచ్చేది లేదని, కావాలంటే రాష్ట్రాలు అప్పులు చేసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంపై మండిపడుతున్నారు. కరోనాను సమర్థంగా నిలువరించడంలోనూ కేంద్రం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే, జాతీయ పార్టీ పెట్టడానికి ఇదే సరైన సమయమని కేసీఆర్ యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళితే రాష్ట్రంలో కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయవచ్చన్న ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి రెండు ప్రత్యామ్నాయాలను కేసీఆర్ పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పాలనకు సంబంధించిన పూర్తి పగ్గాలను ఇపస్పటికే కెటిఆర్‌కు అప్పగించారని భావించాలి. పార్టీ పరంగానే కాకుండా ప్రభుత్వ పరంగా కెటిఆర్ అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో కెటిఆర్ రానున్న ఎమ్మెల్సీ, గ్రేటర్ ఎన్నికలను ఎదుర్కొనేలా కార్యాచరణ చేపట్టారు.

# ప్రకటనకు ముందే దుబ్బాకలో ప్రచారహోరు

**అభివృద్ధి పనులతో ముందుకు సాగుతున్న హరీష్ రావు**

**టిఆర్ఎస్‌పై విమర్శలే లక్ష్యంగా బిజెపి ప్రచారం**

సిద్దిపేట,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): సిద్దిపేట జిల్లా దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికపై అన్ని రాజకీయ పార్టీలు జోరు పెంచాయి. ఉప ఎన్నిక నోటిఫికేషన్ రాకున్నా ప్రచారంలో మాత్రం పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. అనేక అభివృద్ధి కార్యక్రమాలతో టిఆర్ఎస్ నేత,మంత్రి హరీష్ రావు ప్రచారంలోఉన్నారు. గెలుపు లక్ష్యంగా టీఆర్ఎస్ దృష్టి సారించింది. బిజెపి నేత రఘునందన రావు కూడా ప్రచారంలో గ్రామాలను చుట్టి వస్తున్నారు. ఆయనే ఇక్కడ బిజెపి అభ్యర్థిగా బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారికంగా అభ్యర్థిని ప్రకటించడానికి ఢిల్లీ నుంచి అనుమతి రావాల్సి ఉంది. టిఆర్ఎస్ నుంచి దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి భార్య సుజాతకు దాదాపు టిక్కెట్ ఖాయమైనట్లే. రామలింగారెడ్డి మరణంతో దుబ్బాక అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించాల్సిన అనివార్యత ఏర్పడింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దుబ్బాక ఉప ఎన్నిక షెడ్యూలు వెలువడుతుందని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. త్వరలోనే ఎన్నికల షెడ్యూలు రావచ్చని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి భార్య సుజాత టికెట్ దక్కడం దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది. జర్నలిస్టుగా పనిచేసిన రామలింగారెడ్డి 2004, 2008లో దొమ్మాట నుంచి, 2009, 2014, 2018 ఎన్నికల్లో దుబ్బాక నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. 2009 మినహా అన్ని ఎన్నికల్లోనూ రామలింగారెడ్డి గెలుపొందారు. 2018 మినహా అన్ని ఎన్నికల్లోనూ మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి ఆయనకు ప్రత్యర్థిగా పోటీ చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన ముత్యంరెడ్డి గత ఏడాది సెప్టెంబర్‌లో అనారోగ్యంతో మరణించారు. 2018 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన మాజీమంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు శ్రీని వాస్‌రెడ్డి కూడా టికెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తూ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గాలకు దుబ్బాక పొరుగునే ఉంది. మంత్రి హరీష్‌రావు దుబ్బాక నియోజకవర్గంలో మండలాలవారీగా విస్తృతంగా పర్యటించి కార్యకర్తలతో భేటీ అవుతున్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, చెరువుల్లో చేపలు వదలడం వంటి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. పార్టీ కేడర్ చెక్కుచెదరకుండా చూడటంతోపాటు అసంతృప్తుల బుజ్జగింపు, ఇతర పార్టీల నుంచి చేరికలు తదితరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పావులు కదుపుతున్నారు. ఉప ఎన్నికల్లో తనకు కేసీఆర్ ఎక్కడ బాధ్యత అప్పగించినా గెలిపించిన విషయాన్ని గుర్తు చేస్తూ కార్యకర్తల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు.

# కొందరిలో రెండోసారి లక్షణాలు

**జాగ్రత్తలే మందు అంటున్న వైద్యులు**

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): ఈ మధ్య కరోనా సోకి త్గిన ఆమల్లీ పాజిటివ్ రావడంతో ఆందోళన కలిగిస్తోంది. ఒకరిద్దరిలో ఇలాంటి లక్షణాలు బయపడాయి. పదే పదే పాజిటివ్‌గా రావడమనేది ఒకరిద్దరి సమస్య కాదు. చాలామందికి ఇదే పరిస్థితి ఎదురవుతుండటంతో తాము ఇంకా చికిత్స తీసుకోవాలా, కుటుంబ సభ్యులతో కలిసి ఉండొచ్చా, లేదా, అన్న ప్రశ్నలు వారిని పట్టిపీడిస్తున్నాయి. ప్రభుత్వ కేంద్రాల్లో రెండోసారి వచ్చిన వారికి యాంటీజెన్ పరీక్ష చేయించుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. కరోనా ఉన్న వారిలో 5 నుంచి 10శాతం మందికి రెండోసారి కూడా పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోందని వైద్యులు చెబుతున్నారు. ర్యాపిడ్ పరీక్షలు చేయించుకున్న వారిలో నెగెటివ్ వస్తోందగా, ఆర్టీపీసీఆర్ పరీక్షలో పాజిటివ్‌గా వస్తోందన్నారు. శరీరంలో వైరస్ ఆనవాళు 0.1 శాతం ఉన్నా.. ఆర్టీపీసీఆర్‌లో పాజిటివ్‌గా చూపిస్తోందని, దీంతో ముప్పు ఏమీ ఉండదని వైద్యులు భరోసా ఇస్తున్నారు. 14 రోజుల తర్వాత శరీరంలో వైరస్ ఉన్నా కదలదని.. దాని వల్ల రోగికి, అతడి చుట్టుపక్కల వారికి ఎటువంటి నష్టం వాటిల్లదని స్పష్టం చేస్తున్నారు. రెండు వారాలు గడిస్తే వైరస్ ఇతరులకు సోకే గుణం కోల్పోతుందని పేర్కొంటున్నారు. ఒక వైరస్ నాశనం అయిపోయినా, దాని అవశేషాలు శరీరంలో ఉంటాయని వివరిస్తున్నారు. కరోనా వైరస్ వ్యక్తిలో పూర్తిగా అంతరించిందా లేదా అని నిర్ధారించుకోవడానికి కల్చర్ పరీక్ష చేస్తారు. అయితే, అది మన దేశంలో అందుబాటులో లేదు. ఖర్చుతో కూడుకున్నదే కాక నిర్ధారణ చేసే వ్యక్తులకు కూడా ముప్పు ఉంటుంది. దీంతో ఈ రకం కల్చర్ పరీక్షలు చేయడంఅరుదు. ఒకవేళ శరీరంలో వైరస్ అవశేషాలు ఉన్నటైతే, వారిని కొవిడ్ లేని వారిగానే పరిగణించాలని వైద్యులు చెబుతున్నారు. పాజిటివ్ వచ్చిన కొందరిలో రెండు, మూడు నెలల వరకు వైరసకు సంబంధించిన అవశేషాలు ఉంటాయి. వాటి కారణంగానే పరీక్షలో పాజిటివ్ అని వస్తుంది. ఇలాంటి వారికి ఏ చికిత్స అవసరంలేదు. హోం క్వారంటైన్‌లో ఉన్న వారు 14 రోజుల తర్వాత అసలు పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదు. ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు, ప్రాణవాయువు తగ్గుదల, జ్వరం, దగ్గు తగ్గకపోతేనే వైద్యులను సంప్రందించాలి. అనవసర ఆందోళనతో ఇబ్బందులు పడవద్దని ఫీవర్ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. రెండోసారి పాజిటివ్‌గా నిర్ధారణ అయితే మరో 14 రోజులు హోం క్వారంటైన్‌లో ఉండడం మంచిదంటున్నారు. ఎక్కడకెళ్లినా మాస్కులు ధరించడం, శానిటైజ్ చేయడం, చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవడం తప్పని సరిగ్గా చేయాలి. 14 రోజుల తర్వాత ఎలాంటి లక్షణాలు లేకపోతే వైరస్ లేదనే నిర్ధారించుకోవాలి. జబ్బులున్న వారిలో ఏ మాత్రం వైరస్ చలనం ఉన్నా, మళ్లీ తిరగబెట్టే ప్రమాదమూ ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## అభివృద్ధిని చూసి పార్టీలో చేరికలు: మధుకర్

ములుగు,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ లో చేరికల వర్షం కొనసాగుతున్నది. తాజాగా జిల్లాలోని మహాదేవపూర్ మండలం ఫల్గుల గ్రామ సర్పంచ్ మానెం లక్ష్మయ్య, సుమారు 50 మంది కార్యకర్తలతో కలిసి పెద్దపల్లి జిల్లా పరిషత్ ఛైర్మన్ పుట్ట మధుకర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మధుకర్ మాట్లాడుతూ..అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసే పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకుడు జక్కు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## జంగాయిపల్లి బ్రిడ్జికి మంత్రి హామీ

**రాజ్యాంగ విరుద్ధంగా కేంద్ర వ్యవసాయ బిల్లులు**

**కార్పొరేట్ల గుత్తాధిపత్యంలోకి వ్యవసాయ రంగం**

**సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న కేంద్ర విధానాలు**

**మండిపడ్డ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి**

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): కేంద్ర వ్యవసాయ, విద్యుత్ బిల్లులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రాలకు సమాచారం లేకుండా బిల్లులు తేవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా కేంద్రం బిల్లులను ఆమోదించిందన్నారు. కార్పొరేట్లకు లబ్ది చేకూరేలా ఈ బిల్లులను కేంద్రం తెచ్చింది. రైతు ఉత్పత్తులపై ప్రభుత్వ నియంత్రణ లేకపోతే భవిష్యత్‌లో కార్పొరేట్ల గుత్తాధిపత్యంతో ధరలు పెరుగుతా యన్నారు. కార్పొరేట్లు, రైతులకు వివాదాలు తలెత్తితే పరిష్కరించేదెవరు? వివాదాలు వస్తే సాధారణ రైతు బడా కార్పొరేట్ వ్యవస్థతో పోరాడగలడా? అని ప్రశ్నించారు. కొత్త బిల్లులతో మార్కెట్ కమిటీలు అలంకార ప్రాయంగా మారనున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లాభాపేక్ష తప్పా.. ఎటువంటి మానవత్వం ఉండని విదేశీ బహుళజాతి కంపెనీలు.. గ్రామీణ పేద రైతాంగంపై ఎగబడేందుకు ఈ బిల్లులు అవకాశం కల్పిస్తాయన్నారు. బిల్లుల్లో కనీస మద్దతు ధర గురించి ప్రస్తావనే లేదని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. దీనిపై కేంద్రాన్ని నిలదీస్తామని అన్నారు. రైతులు పక్షాన తెలంగాణ పోరాడుతుంటే కేంద్రం రైతులకు మేలు చేయకుండా వంచన చేస్తోందని అన్నారు. రైతుల ఉత్పత్తులపై ప్రభుత్వ నియంత్రణ లేక పోతే భవిష్యత్‌లో కార్పొరేట్‌ల గుత్తాధిపత్యం పెరిగి ధరల నియంత్రణ రైతు, ప్రభుత్వాల చేయిదాటిపోయి కార్పొరేట్‌ల చేతిలోకి వెళ్తుందని నిరంజన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌లకు, రైతుల మధ్య వివాదాలు తలెత్తితే పరిష్కరించేదెవరని ప్రశ్నించారు. మార్కెట్‌కమిటీలకున్న మధ్యవర్తిత్వ అవకాశాన్ని ఈ బిల్లు కాలరాసిందని విమర్శించారు. కొత్త బిల్లుతో మార్కెట్‌కమిటీలు అలంకార ప్రాయం కానున్నాయని అన్నారు. రైతుల తరపున మాట్లాడే గొంతుకలు నొక్కివేయబడతాయన్నారు. కేంద్ర వ్యవసాయ, విద్యుత్ బిల్లులపై మంత్రి నిరంజన్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లు రైతుమెడపై కేంద్రం కత్తిపెట్టినట్టేనని అన్నారు. రాష్ట్రాలకు సమాచారం లేకుండా బిల్లు తేవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తెలంగాణలో 92.05 శాతం మంది సన్న, చిన్న కారు రైతులే ఉన్నారని చెప్పారు. ఈ బిల్లులో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఊసేలేదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం వ్యవసాయ, వాణిజ్యం, సరఫరా ,పంపిణీ వ్యవస్థ వ్యవసాయ ఉత్పత్తుల ధరల నియంత్రణ కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి పరిధిలో ఉంటాయని, కానీ ఈ బిల్లు విషయంలో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ బిల్లును ఆమోదింప చేసుకుందని అలాగే రాజ్యసభలో ఓటింగ్ పెట్టకుండా ఆమోదించారని అన్నారు. లాభాపేక్ష తప్ప ఏ మాత్రం మానవత్వం ఉండని విదేశీ, స్వదేశీ బహుళ జాతి కంపెనీలు, వ్యాపారులు గ్రామీణ పేద రైతాంగం మీదకు ఎగబడేందుకు ఈ బిల్లుఅవకాశం కల్పిస్తుందని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు.

## అధికారుల అలసత్వమే తమ బిడ్డ మృతికి కారుణం

**-నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో సుమేధ తల్లిదండ్రుల ఫిర్యాదు**

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): ఓపెన్ నాలాలో పడి మృతి చెందిన సుమేధ కపూరియా (12) తల్లిదండ్రులు సోమవారం నేరెడ్‌మెట్ పోలీసులను కలిశారు. ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే తమ బిడ్డ ప్రాణాలు కోల్పోయిందని పేర్కొంటూ.. మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్, నగర మేయర్ బొంతు రామ్మోహన్, జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్, స్థానిక కార్పొరేటర్, సంబంధిత ఏఈ, డీఈలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వీరందరిపై ఐపీసీ సెక్షన్ 304 ప్రకారం కేసు నమోదు చేయాలని ఈ మేరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు. కాగా, నేరెడ్‌మెట్‌లోని కాకతీయ నగర్‌లో నివాసముండే అభిజిత్, సుకన్య దంపతుల కుమార్తె సుమేధ గత గురువారం సాయంత్రం సైకిల్ తొక్కుకుంటూ బయటికెళ్లింది. దీన్‌దయాళ్ నగర్‌లోని ఓపెన్ నాలాలో ప్రమాదవశాత్తూ పడి మరణించింది. వరద ఉధృతికి బాలిక మృతదేహం బండచెరువుకు కొట్టుకొచ్చింది.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-వరదప్రాంతాల్లో పర్యటించిన మంత్రి గంగుల**

కరీంనగర్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): మరో రెండు రోజులపాటు భారీ వర్ష సూచన ఉండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బిసి సంక్షేమం, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. వర్షం, వరదలతో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో మేయర్ సునీల్ రావుతో కలిసి మంత్రి గంగుల కమలాకర్ పర్యటించారు. రేకుర్తిలో పలు ఇళ్లలోకి నీళ్లు రావడాన్ని మంత్రి పరిశీలించారు. నగర శివారులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఓపెన్ ఎ÷-లాట్లలో నీళ్లు నిలిచి పలు ఇళ్లలోకి నీళ్లు చేరాయన్నారు. నిలిచి ఉన్న నీళ్లను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం మేరకు జిల్లా కేంద్రంలో ఉండి వర్షం, వరదల పరిస్థితిని సమీక్షిస్తున్నామని ఎక్కడ ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎలాంటి విపత్కర పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగంతో పాటు టిఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని గంగుల పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో వర్షాకాలం ఆరంభంతోనే జిల్లాలోని జలాశయాలన్ని జలకళను సంతరించుకున్నాయని, ఏ చిన్న వర్షం పడ్డా జలాశయాలు ఓవర్ ఎ÷-లో అయ్యే పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఉండటంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి, మంచి నీటిని కాచి చల్లార్చి తాగాలని మంత్రి సూచించారు.

## లారీబోల్తా: ఇద్దరు మృతి

వికారాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): జిల్లాలోని దౌల్తాబాద్ మండలం గోకఫసులబాద్ శివారులో రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది. లారీ బోల్తా పడ్డ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మృతులు రావుల పల్లి గ్రామానికి చెందిన నర్సప్ప (38) అబ్దుల్ (35)గా గుర్తించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# శ్రీవారిపై సీఎం జగన్‌కు అపారభక్తి

### మంత్రి కొడాలి నాని వాఖ్యలు ఆయన వ్యక్తిగతం
### డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వెల్లడి

తిరుమల,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): శ్రీవారిపై అపారమైన భక్తి విశ్వాసం కలిగిన వ్యక్తి సీయం జగన్ అని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. మంత్రి కొడాలి నాని వాఖ్యలు ఆయన వ్యక్తిగతమని స్పష్టం చేశారు. డిక్లరేషన్ అంశం ఇప్పుడు అనవసరమని.. గతంలో వైయస్ రాజశేఖర రెడ్డి, జగన్ అనేక సార్లు శ్రీవారి దర్శనం కోసం విచ్చేశారని చెప్పుకొచ్చారు. శ్రీవారి భక్తుడు కాబట్టే జగన్ కాలినడకన తిరుమల విచ్చేశారన్నారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని డిప్యూటీ సీఎం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ జగన్‌కు ప్రజలపై విశ్వాసం ఉందని...ప్రజలే దేవుళ్ళుగా భావిస్తారని అన్నారు. ఆయనకు కులం, మతం పట్టింపులు లేవని చెప్పారు. దేశంలో ఎవ్వరూ చేయని సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటంతో ప్రతిపక్షాలు కుట్ర చేస్తూన్నాయని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి ఆరోపించారు.

జగన్ పర్యటనకు ఏర్పాట్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మార్కండేయులు ఆదేశించారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23, 24 తేదీల్లో తిరుమల పర్యటనకు రానున్నట్లు తెలిపారు. 23న మధ్యాహ్నం 3.05 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 3.50 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి నేరుగా రోడ్డు మార్గంలో తిరుమల పద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి బేడి ఆంజనేయస్వా మి ఆలయానికి చేరుకుని, శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారన్నారు. ఉత్సవాల్లో పాల్గొని, తర్వాత అతిథి గృహంలో బస చేస్తారని, 24న ఉదయం 6.25 గంటలకు మరోమారు వెంకన్నను దర్శించుకుని, తిరుమల నుంచి తిరుగు ప్రయాణమవుతారని తెలిపారు. అలాగే బెంగళూరు నుంచి కర్ణాటక సీఎం యడ్యూరప్ప ఈనెల 23న సాయంత్రం తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి తిరుమలకు రోడ్డు మార్గంలో వెళతారన్నారు. వారి పర్యటనకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు ఐజీ శశిధర్‌రెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డు మార్గంలో శానిటేషన్ చర్యలు, ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం కోసం వచ్చే ప్రతినిధుల కోసం ప్రత్యేక బారికేడ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. తరువాత ముఖ్యమంత్రి ప్రయాణించనున్న రోడ్డు మార్గంలో ట్రయల్‌రన్ నిర్వహించారు.

# జాతీయ విద్యావిధానంతో విశ్వగురువుగా భారత్

### అంతర్జాతీయ ప్రమాణాలు నెలకొల్పేలా విద్యారంగం
### -గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): జాతీయ విద్యా విధానం-2020 సమర్థవంతమైన అమలుతో భారత్ విశ్వగురువుగా అవతరిస్తుందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. భారతీయ మూలాల ఆధారంగా ఆధునిక ప్రపంచ అవసరాలకనుగుణంగా రూపొందిన ఈ జాతీయ విద్యావిధానంతో విద్యారంగంలో భారత్ అంతర్జాతీయ ప్రమాణాలు నెలకొల్పుతుందన్న ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు. విద్యాభారతి సంస్థ ఈ నూతన విద్యా విధానంపై విద్యార్థులలో అవగాహన పెంచడానికి వారిని చైతన్యవంతం చేయడానికి 'మై ఎన్ఈపీ' కార్యక్రమం ద్వారా పోటీలు నిర్వహించే కార్యక్రమాన్ని గవర్నర్ సోమవారం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం రూపకర్తలైన ప్రముఖ సైంటిస్టు డా. కస్తూరి రంగన్ ఇతరసభ్యులు విద్యా రంగంలో భారత్‌కు ప్రాచీన కాలం నుంచి ఉన్నగొప్ప పేరును, వైభవాన్ని తిరిగి సాధించాలన్న స్పష్టమైన లక్ష్యంతో ఎన్ఈపీ-2020 ప్రవేశపెట్టారని గవర్నర్ వివరించారు. విద్యా రంగంలో మౌలికమైన, సమూల మార్పుల ద్వారా ఆధునిక సాంకేతిక యుగానికి సంబంధించి వివిధ రంగాల్లో భవిష్యత్ నాయకులను తయారు చేయడానికి ఈ విధానం తోడ్పడుతుందని అన్నారు. భారత్‌ను విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చడం, నాలెడ్జ్ సూపర్ పవర్‌గా తీర్చిదిద్దడం అన్నస్పష్టమైన లక్ష్యాల తో వచ్చిన ఈ నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ ని సమర్థవంతమైన అమలు కోసం అందరూ భాగస్వాములు కావాలని డా. తమిళిసై పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి దక్షిణ మధ్య అధ్యక్షుడు సిహెచ్ ఉమామహేశ్వర రావు, సరస్వతి విద్యాపీఠం అధ్యక్షుడు ప్రొఫెసర్ తిరుపతిరావు, కేశవ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి అన్నదానం సుబ్రమణియం, ఎన్‌సీఈఆర్‌టి మెంబర్ పి.మురళీ మనోహర్, విద్యాభారతి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్. సుధాకర్‌రెడ్డి, విద్వత్ పరిషత్ అధ్యక్షులు ఆవుల మంజులత తదతరులు పాల్గొన్నారు.

# అక్రమ కార్యకలాపాలపై దూకుడు పెంచిన పోలీసులు



కరీంనగర్, సెప్టెంబర్ 21 (నేటినిజం ప్రతినిధి):అక్రమ కార్యకలాపాల నియంత్రణపై కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు దూకుడు పెంచారు. కమిషనరేట్‌లో పోలీసులు కొనసాగిస్తున్న ఈదాడుల పరంపర సోమవారంనాటికి మూడవరోజుకు చేరుకుంది. తీగనులాగి డొంకను కదిలించి నట్లుగా చిన్నచిన్న సమాచారాలను ఆధారం చేసుకుని వాటికిమూలాధారాలను అన్వేషిస్తూ దాడులను కొనసాగిస్తున్నారు. సోమవారం నాడు కమిషనరేట్‌వ్యాప్తంగా కొనసాగించిన దాడుల వివరాలు ఇలాఉన్నాయి.

నిషేదిత పొగాకు ఉత్పత్తుల స్వాధీనం

కేశవపట్నం పోలీసులు కన్నారం గ్రామంలోని ఒకకిరాణం దుకాణంపై దాడి నిర్వహించారు. అక్కడ లభించిన సమాచారం ఆధారంగా గంగాధరకు వెళ్ళి సోదాలు నిర్వహించగా భారీమొత్తంలో నిషేదిత పొగాకు ఉత్పత్తుల నిల్వలు లభించాయి. పైనపేర్కొన్న రెండు ప్రదేశాల్లో పోలీసులు 1,01,250రూపాయల విలువచేసే నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారులపై కేసునమోదు చేశారు. అలాగే తాడికల్‌గ్రామంలో దాడి నిర్వహించి 18,750రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి పోలీసులు బావుపేటలో 2923రూపాయలు, కొత్తపల్లిలో 1983రూపాయల విలువచేసే నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. విక్రయదారులు శ్రీపుర చంద్రశేఖర్, కేశ రమేష్‌లపై కేసులను నమోదు చేశారు.

పేకాటరాళ్ళ పట్టివేత

చొప్పదండి మండలంలోని వెదురుగట్ట గ్రామశివారులో మూడుపత్తాల ఆట ఆడుతున్న 06గురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా 3190రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు ముకరంపుర ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిపై కేసునవోదు చేశారు. వీరివద్దనుండి 3610రూపాయలన నగదును స్వాధీనం చేసుకున్నారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

కరీంనగర్‌లోని శర్మనగర్ ప్రాంతంలో స్పెషల్‌బ్రాంచి హెడ్‌కానిస్టేబుల్ రాంమ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు నిల్వఉంచిన 06క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యాన్ని పట్టుకుని టూటౌన్ పోలీసులకు అప్పగించారు. దీని విలువ 06వేల రూపాయలు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు కశ్మీర్‌గడ్డ ప్రాంతంలో 04క్వింటాళ్ళ పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, విక్రయదారుడు మహ్మద్ అమ్జద్‌పై కేసునమోదు చేశారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పదుతున్న ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర పోలీసులు అక్రమంగా ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. చొప్పదండి పోలీసులు గర్రెపల్లి నుండి చొప్పదండికి అక్రమంగా తరలివస్తున్న 04ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.

నల్లబెల్లం, గుడుంబా పట్టివేత

కేశవపట్నం పోలీసులు రెండు ఆటోల్లో అక్రమంగా రవాణా అవుతున్న నల్లబెల్లంను వాహనాల తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్నారు. గంగాధర పోలీసులు రాయులపల్లి గ్రామంలో 10లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పెగడపల్లి మండలం మద్దులపల్లికి చెందిన విక్రయదారుడు అజ్మీరా రవినాయక్‌పై కేసునమోదు చేశారు.

# నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు



కరీంనగర్, సెప్టెంబర్ 21 (నేటినిజం ప్రతినిధి):కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ విభాగం పోలీసులు సోమవారంనాడు పక్కాసమాచారంతో రామడుగు మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 83,500రూపాయల విలువచేసే నిషేధితపొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కాసమాచారంతో గోపాలరావుపేటలో అదేగ్రామానికి చెందిన బోనగిరి కొండయ్య, వెలిచాల గ్రామానికి చెందిన శ్రీపురం మురళిలను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద వివిధ రకాలకు చెందిన నిషేదిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని రామడుగు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ కేసులో పెగడపల్లి మండలం ఎల్లాపూర్‌కు చెందిన పెద్ది భూమయ్య పరారీలో ఉన్నాడు.

## గురకపెట్టేవారిలో కరోనా ముప్పు

న్యూఢిల్లీ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల్లో గురక పెట్టి పడుకునే వాళ్లు ఉన్నట్లయితే వారి ప్రాణాలకు మూడు రెట్లు ముప్పు ఎక్కువని పరిశోధకులు తేల్చారు. కరోనా వైరస్, నిద్రకున్న సంబంధంపై ఇప్పటి వరకు జరిపిన 18 అధ్యయనాలను వార్‌విక్ యూనివర్శిటీకి చెందిన పరిశోధకులు పరిశీలించి ఈ అభిప్రాయానికి వచ్చారు. గుర్రు పెడుతూ నిద్రపోయే వారిలో కండరాలు విశ్రాంతి తీసుకున్నప్పుడు కొన్ని క్షణాలపాటు తాత్కాలికంగా శ్వాసనాళంలోకి గాలి సరిగ్గా పోదని, ఫలితంగా వారికి ప్రాణాపాయం ఎదురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పరిశోధకులు తెలిపారు. గుర్రు పెట్టేవాళ్లకు కరోనా సోకడం ఒక రిస్క్ ఫ్యాక్టరేకానీ, అదనపు రిస్క్ ఫ్యాక్టర్ కాదని పరిశోధకులు చెప్పారు. అంటే స్థూలకాయం, రక్తపోటు, మధుమేహం ఉన్నట్లయితే ఆ మూడే వారికి రిస్క్ ఫ్యాక్టర్లని, వారిలో గురుకపెట్టే వారున్నట్లయితే వారికి అది అదనపు రిస్క్ ఫ్యాక్టర్ కాబోదని కూడా పరిశోధకలు తెలిపారు. వాస్తవానికి ఈ మూడు అనారోగ్య సమస్యలున్న వారందరికి గురకపెట్టే అలవాటు వస్తుందని వారు చెప్పారు. ఇంగ్లండ్‌లో 15 లక్షల మంది, అమెరికాలో 2.20 కోట్ల మంది గురక సమస్యతో బాధ పడుతున్నారు.

## కార్పోరేటర్ అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్22 (ఆర్ఎన్ఎ): యువతిపై దాడి చేసిన కేసులో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌ను సైబరాబాద్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారం రోజుల క్రితం నల్లగండ్లలోని గ్రేటర్ కమ్యూనిటీలో ఉండే ఓ ఫ్యాషన్ డిజైనర్ యువతితో నాగేందర్ గొడవ పడ్డారు. అనంతరం యువతిపై దాడి చేశారు. దీంతో సదరు యువతి షీ టీమ్‌ను ఆశ్రయించి, అతడిపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం అతడ్ని అదుపులోకి తీసుకున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధం కావాలి: బీరం

నాగర్ కర్నూల్,సెప్టెంబర్22 (ఆర్ఎన్ఎ): రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు నియోజకవర్గంలోని టీఆర్ఎస్ శ్రేణులంతా సమాయత్తం కావాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల ఎన్రోల్ మెంట్ కోసం 150 మంది చురుకైన కార్యకర్తలను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. నూతన వ్యవసాయ చట్టంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల నడ్డి విరిచేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.కొత్త విద్యుత్ విధానం ద్వారా రైతులపై విద్యుత్ బిల్లులు మోపేందుకు కేంద్రం సిద్ధమయ్యిందన్నారు. రైతు వ్యతిరేక బీజేపీని ప్రజలు గమనిస్తున్నారని బీరం అన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే పార్టీ నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## పట్టభద్ర ఎమ్మెల్సీలో గెలుస్తాం
### -ఎవరికి టిక్కెట్ ఇచ్చినా గెలిపిస్తాం: పైళ్ల

యాదాద్రి భువనగిరిన్యూఢిల్లీ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గానికి జరుగనున్న ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని భువనగిరి శాసనసభ్యుడు పైళ్ల శేఖర్ రెడ్డి టీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్ర ఓటరు నమోదు కూడా చేపట్టాలన్నారు. వలిగొండ పట్టణ కేంద్రంలోని దేవిశ్రీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు.

పార్టీ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి అవకాశం ఇచ్చినా వారిని గెలిపించే బాధ్యత అందరిపై ఉందన్నారు. 2017 వరకు డిగ్రీ పూర్తిచేసిన పట్టభద్రులను నూతన ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. కరోనా విషయంలో అధైర్యపడాల్సిన అవసరం లేదని, హోంఐసొలేషన్‌లో చికిత్స పొందుతున్న వారికి పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్నామన్నారు. ఎయిమ్స్‌తోపాటు భువనగిరి ఏరియా దవాఖానాలో కూడా ఐసొలేషన్ వార్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం లాంటి అసాధ్యమైన ప్రాజెక్టును సుసాధ్యం చేసి భువనగిరి నియోజకవర్గానికి గోదావరి నీళ్లను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పైళ్ల రాజ వర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దేగల పండరి,

పీఏసీఎస్ చైర్మన్ లు సురకంటి వెంకటరెడ్డి, చిట్టెడి వెంకట్ రామ్ రెడ్డి, రైతుబంధు కన్వీనర్ మమత, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొనపూర్ కవిత టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఐటిపాముల రవీంద్ర, మదర్ డెయిరీ డైరెక్టర్ గూడూరు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులకు ఎసరు
### నవరత్నాల పేరిట పందేరంతో ఓటు బ్యాంక్
### వైకాపా తీరుపై మండిపడుతున్న టిడిపి

విజయవాడ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): నవరత్నాల పేరిట డబ్బు పంచుతున్నామని చెప్పి ఎస్సీ సబ్‌ప్లాన్ కేటాయింపులు ఎత్తివేశారని ఏపిలో టిడిపి విమర్శల చేస్తోంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల మంజూరు నిలిచిపోయింది. ఫలితంగా దళితులకు ఉన్నవి కూడా పోయాయని మండిపడుతున్నారు. మరోవైపు ఈ ప్రభుత్వం తమదే అని భావిస్తున్న దళితులకు గ్రామాలలో పెత్తందార్ల నుంచి పరాభవం ఎదురవుతోంది. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయి. విద్యావంతులైన దళితులు ఇప్పుడిప్పుడే వాస్తవాలను గ్రహిస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన పెంపొందించాలన్న సదుద్దేశంతో ఏర్పాటుచేసిన డ్వాక్రా గ్రూపులను కూడా సంక్షేమం పేరిట నిర్వీర్యం చేస్తున్నారని టిడిపి నేతలు విరుచుకుపడుతున్నారు. డ్వాక్రా గ్రూపుల విషయంలో టిడిపి ముందు నుంచి పట్టుదలగా పనిచేసింది. వారే తమ ఓటుబ్యాంకుగా భావించింది. అయితే సిఎం జగన్ ఇప్పుడు మరో రకంగా వారికి అండగా నిలుస్తున్నారు. అయితే విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, మద్యం ధరలు భారీగా పెంచి, నవరత్నాల పేరుతో పంచుతున్నారని టిడిపి విమర్శలు చేస్తోంది. ఉత్పాదక రంగాలపై ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవడం వల్ల రెవెన్యూ లోటు భారీగా పెరిగిపోతుంది. ఆ పరిస్థితి ఏర్పడితే జీఎస్‌డీపీ పడిపోయి అప్పులు కూడా పుట్టని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరిస్తోంది. ఓటు బ్యాంకును తీర్చిదిద్దుకోవడానికై ప్రజాధనాన్ని విచ్చలవిడిగా పంచిపెట్టవచ్చా? ఈ ధోరణిని సమాజమే ప్రతిఘటించాలి! నిజం చెప్పాలంటే, సంక్షేమంలో కూడా కొన్ని వర్గాలు వంచనకు గురవుతున్నాయి. దళితులు ఈ విషయంలో ముందు వరుసలో ఉంటారని హెచ్చరిస్తున్నారు. డ్వాక్రా మహిళలను సొంత కాళ్లపై నిలబడకుండా చేసి ప్రభుత్వ సాయం కోసం అర్రులు చాచేలా చేస్తున్నారని మండిపడుతున్నారు. నాడు రాజశేఖర్ రెడ్డి ఫీజుల చెల్లింపులతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను అమలుచేయడంతో పాటు పెద్దఎత్తున జలయజ్ఞం చేపట్టి ప్రాజెక్టులను నిర్మించడం వల్లనే ఆయన మళ్లీ అధికారంలోకి రాగలిగారు. అభివృద్ధి వికేంద్రీకరణ పేరిట జగన్ ప్రభుత్వం ప్రారంభించిన రాజధాని మూడు ముక్కలాట చుట్టూ రాజకయీయం సాగుతోంది. అధికారంలోకి వచ్చిన కొత్తలో చంద్రబాబు ప్రభుత్వం రెండు లక్షల కోట్లు అప్పు చేసిందని జగన్ విమర్శించారు. ఇప్పుడు ఏడాదికే లక్ష కోట్లు అప్పు చేశారని టిడిపి అంటోంది. ఇదే ఒరవడి కొనసాగితే మరో నాలుగు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేయవలసి ఉంటుందని దుయ్యబడుతున్నారు. అదే జరిగితే చేసే అప్పు పాత అప్పుల వడ్డీ చెల్లించడానికి కూడా సరిపోదని అంటున్నారు. ప్రతిపాదిత నీటి ప్రాజెక్టులతో పాటు అభివృద్ధి కార్యక్రమాలన్నీ ఎక్కడివక్కడే నిలిచిపోతాయని హెచ్చరిస్తున్నారు.

## రైతులకు సాయంలో ముందుచూపు ఏదీ
### -అతివృష్టిలోనూ కానరాని ఉదారత: సిపిఎం

విజయవాడ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): విపత్తులతో పంటలు దెబ్బ తింటుండగా ఖరీఫ్ ఆదిలోనే నెల్లూరులో వరి, కర్నూలులో ఉల్లి రైతులకు మద్దతు ధరలు లేకుండా పోయాయిని సిపిఎం నాయకుడు సిహెచ్ శ్రీనివాస రావు అన్నారు. వ్యవసాయం, రైతులెదుర్కొంటున్న సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి దాని నిర్మాణాత్మక, ఆచరణాత్మక ప్రణాళికలు ముఖ్యమన్నారు. రైతుభరోసా వంటి ఉపశమన చర్యలు, చిట్కాలు ఎప్పటికీ పరిష్కారాలు కాబోవన్నారు. అవే సర్వరోగ నివారిణి కాదని, ఎల్లకాలం వాటితోనే రైతులను భ్రమల్లో పెట్టలేరన్నారు. అతివృష్టి అనావృష్టి రెండు అతి ముఖ్యమైన రైతు సమస్యలను పటిష్టంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. తాత్కాలిక, శాశ్వత చర్యల సన్నద్ధత కొరవడింది. రైతు భరోసా సాయం, రైతు భరోసా కేంద్రాలు ఈ రెంటినే ప్లలె వేస్తూ పొద్దుపుచ్చుతోంది. ఉదాహరణకు గత నెలలో వరదలకు ఉభయ గోదావరి జిల్లాల్లో పోలవరం నిర్వాసిత ప్రాంతాలు, నదీపరీవాహక గ్రామాలు వారం పాటు నీళ్లలో తేలియాడాయి. ఏరియల్ సర్వే చేసిన సి.ఎం, ఇళ్లు మునిగిన వారికి రూ.2 వేల తక్షణ సాయం ప్రకటించారు. కానీ మూడు వారాల తర్వాత నగదు బదిలీ అని ఉత్తర్వులొచ్చాయి. ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి. సర్వం కోల్పోయిన వారు ఆ పత్రాలన్నీ ఇచ్చాక, బ్యాంకుకో, దగ్గరలోని ఎటిఎంకో వెళ్లి రెండు వేలు డ్రా చేసుకోవాలన్నారు. కరోనా సమయాన రవాణా లేని వేళ కిలోమీటర్లు ప్రయాణించమనడం ఆపన్నులకు సాయం చేయడమా? అని ప్రశ్నించారు. కరోనా వ్యాప్తిని ప్రోత్సహించడమా? గ్రామ వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఏమయ్యారు? వరద బాధితుల సాయానికీ డిబిటి పిసరంత సాయానికి కోత పెట్టే దుర్మార్గం కాదా? అన్నారు. పులిచింతల నిర్వాసితులకు, ప్రభుత్వ 'ప్రాయోజిత' కుందూ విపత్తు సహా, వరద బాధితులను పట్టించుకోకపోవడం దారుణం కాక మరోటి కాదన్నారు. అనంతపురంలో తొలుత మంచి వర్షాలు పడగా అనంతరం నెలకొన్న డ్రై స్పెల్‌కు పంటలు దెబ్బతిన్నాయి. నష్టపరిహారం కోసం రైతుల ఆందోళనలు కొనసాగుతుండగానే వరదలొచ్చి ఆ దెబ్బతిన్న పంటలే మునిగాయి. ఉత్తరాంధ్రలో అక్కడక్కడ పడుతున్న వర్షాలను చూపించి కరువును మాఫీ చేసే ఎత్తులో సర్కారు ఉందనడానికి నిదర్శనం సెప్టెంబర్ మధ్యకొచ్చినా వ్యవసాయ కంటింజెన్సీ ప్లానులు రూపొందించకపోవడం, కరువు మండలాల ప్రకటనపై కించిత్తు కసరత్తు చేయకపోవడం సరికాదన్నారు. ప్రయోగాత్మకంగా శ్రీకాకుళంలో రైతుల ఉచిత విద్యుత్‌కు మీటర్లు బిగించడంపై ఉన్న శ్రద్ధ అక్కడి కరువు నివారణపై లేదంటే, సర్కారు అసలు చూపు ఎటుందో అర్థమవుతుందన్నారు.

## ఇఎస్ఐ కేసులో దేవికారాణికి బెయిల్

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): ఈఎస్ఐకి చెందిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) కుంభకోణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ స్కాంలో ప్రధాన నిందితురాలిగా ఉన్న దేవికారాణికి ఏసీబీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆమెతో పాటు జాయింట్ డైరెక్టర్ పద్మ, ఫార్మసీస్ట్ వసంత, మరో ఇద్దరు ఫార్మా ఉద్యోగులకు కోర్టు బెయిలు మంజూరు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ కిట్లు, ఫార్మా కంపెనీలకు మందుల సరఫరా కాంట్రాక్టుల అప్పగింతలో జరిగిన అవకతవకల్లో రూ.కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసును ఐటీతోపాటు ఈడీ కూడా దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ అవతవకల ద్వారా వచ్చిన సొమ్ముతో మాజీ డైరెక్టర్ దేవికారాణి, మాజీ జేడీ పద్మ తదితరులు భారీగా ఆస్తులు కొనుగోలు చేసిన విషయాన్ని ఏసీబీ తన దర్యాప్తులో వెల్లడించింది. దేవికారాణిపై దాడుల సమయంలో ఇందుకు సంబంధించిన పలు రసీదులు దర్యాప్తు అధికారులకు లభించడంతో ఈ విషయం వెలుగుచూసింది.

### శ్రీవారిని దర్శించుకున్న టిఆర్ఎస్ ఎమ్మెల్యే

తిరుమల,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారిని కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు టీటీడీ మాజీ జేఈవో, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి కే.ఎస్ శ్రీనివాస రాజు స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీరు స్వామి వారికి జరిగే నైవేద్య విరామ సమయంలో స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో ఎమ్మెల్యేకు వేద పండితులు వేద ఆశీర్వాచనం చేయగా..టీటీడీ ఆలయ అధికారులు పట్టువస్త్రాలను, తీర్థ ప్రసాదాలు అందజేసారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. కరోనా మహమ్మారి నుంచి మానవాళికి విముక్తి ప్రసాదించాలని స్వామి ప్రార్థించినట్లు తెలిపారు.

## భీంవడి మృతుల సంఖ్య 17కు చేరిక

ముంబై,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలోని థానే జిల్లా భీవండిలో భవనం కుప్పకూలిన ఘటనలో మృతుల సంఖ్య 17కు చేరింది. సోమవారం తెల్లవారుజామున మూడు అంతస్తుల భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే. శిథిలాల కింద చిక్కుకుపోయిన 20 మందిని రక్షించినట్లు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు తెలిపాయి. భవనం శిథిలావస్థకు చేరడంతోనే ప్రమాదం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు. 'భీవండి ఘటన ఎంతగానో కలచివేసింది. బాధితుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి' అని రాష్ట్రపతి ట్వీట్ చేశారు. 'భవనం కూలిపోవటం విచారకరం. తీవ్ర ఆవేదనలో ఉన్న కుటుంబాలకు నా సంతాపం. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి. బాధితులకు అన్ని విధాలా సాయం అందిస్తాం' అని ప్రధాని ట్వీట్ చేశారు.

## అద్దెకు టాటా నెక్సన్

ముంబై,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): టాటా మోటర్స్‌కు చెందిన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ నెక్సన్‌ను సైతం అద్దెకు ఇస్తున్నట్లు ప్రకటించింది. స్వల్పకాలంపాటు అమలులో ఉండనున్న ఈ కారుపై నెలకు అన్ని కలుపుకొని రూ.34,900 రెంటల్ వసూలు చేస్తున్నది. నవంబర్ 30 వరకు అమలులో ఉండనున్న ఈ ఆఫర్ ఏడాది, రెండేండ్లు, మూడేండ్ల కాలపరిమితితో తొలి వంద మంది కస్టమర్లకు మాత్రమే అందిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, పుణె, బెంగళూరులలో ఈ సేవలను అందిస్తున్నది.

## జీవో 22ను రద్దు చేయాలి: సిపిఎం

ఏలూరు,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒ 22ను రద్దు చేయాలని, రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సిపిఎం జిల్లా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ పథకం స్థానంలో నగదు బదిలీ అమలు చేస్తామని తెచ్చిన జిఒ 22 రైతుల పాలిట శాపంగా మారనుందని తెలిపారు. ల్గ÷తుల ప్రయోజనాలను దెబ్బతీసే విద్యుత్ చట్టం-2003 సవరణ బిల్లును ఉపసంహరించు కోవాలని రైతు సంఘం డెల్టా జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

మెదక్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా వారికి 3 నెలల ఉచిత శిక్షణ ఇచ్చి సంబంధిత రంగంలో ఉద్యోగం కల్పిస్తామని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ తెలంగాణ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్ ద్వారా డీడీయూ-జీకేవై (దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కోశల్ యోజన) కార్యక్రమం కింద జిల్లాలోని నిరుద్యోగ యువకులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కంప్యూటర్ నైపుణ్యత, స్పోకెన్ ఇంగ్లిష్ స్టాఫ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, టైపింగ్, ఆర్థమెటిక్, హిందీ గ్రోమింగ్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఉంటుందన్నారు. పదో తరగతి, ఇంటర్ పూర్తయిన పురుషులు, 19 నుంచి 26 సంవత్సరాలు ఉండాలన్నారు. ఆసక్తి గల వారు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు జిరాక్స్, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, కులం సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో మెదక్ పట్టణంలోని గాంధీనగర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ఈ నెల 22వ తేదీ నుంచి 30 వరకు ప్రతి రోజు నేరుగా హాజరుకావాలన్నారు.

## గ్రేటర్ ఎన్నికల్లో విజయం కోసం కృషి
### -టీఆర్ఎస్ కుట్రలను ప్రజలకు వివరించాలి: మర్రి

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బోగస్ ఓట్లతో, అక్రమ డీలిమిటేషన్ పక్రియతో గెలవాలని అధికార టీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ నాయకుడు, మాజీమంత్రి మర్రి శశిధర్ రెడ్డి అన్నారు. టీఆర్ఎస్ పాలన పట్ల ప్రజల్లో చాలా వ్యతిరేకత ఉందని, ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ విజయం ఖాయమని అన్నారు. టీఆర్ఎస్ కుట్రలను ఛేదించి గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బోగస్ ఓట్లను చేర్పించి లబ్ది పొందాలని టీఆర్ఎస్ యత్నిస్తోందని, ఒక్కో డివిజన్‌లో ఒక్కో రకంగా ఓట్లు నమోదు చేశారని ఆరోపించారు. డివిజన్ల డీలిమిటేషన్ పక్రియ పకడ్బందీగా జరిగేలా నగర కాంగ్రెస్ నాయకులు పోరాటం చేయాలని కోరారు. 150 డివిజన్లలో కాంగ్రెస్ కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలను పూర్తి చేయాలని, నాయకులు గడప గడపకూ తిరిగి ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలని పిలుపునిచ్చారు.

మల్కాజిగిరి ఎంపీ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ల డీలిమిటేషన్, ఓట్ల చేర్పులో కాంగ్రెస్ నేతలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. 150 డివిజన్లలో ముఖ్య నాయకులను, ప్రధానంగా యువకులను గుర్తించి గడపగడపకూ పాదయాత్ర చేయాలని కోరారు.

## నాలాలపై ఆక్రమణలు తొలగించాలి
### -మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

వరంగల్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): గత కొద్దిరోజుల క్రితం భారీగా కురిసిన వర్షాల కారణంగా వరంగల్ నగరంలోని లోతట్టు ప్రాంతాల ముంపు, జలమయానికి కారణమైన నాలాలపై దురాక్రమణల కట్టడాలను, సాధ్యమైనంత వేగంగా తొలగించాలని రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అధికారులను ఆదేశించారు. వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అభివృద్ధిపనులు, నాలాలపై దురాక్రమణలు, అక్రమ కట్టడాల తొలగింపు వంటి పలు అంశాలపై మంత్రి తన క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ లోతట్టు ప్రాంతాలు జలమయం అయిన సంగతి తెలిసిందే. ప్రజలంతా ముక్తకంఠంతో నాలాలపై కట్టడాలను, దురాక్రమణలను తొలగించాలని కోరారన్నారు. ఐటీ, పరిశ్రమలు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కేటీఆర్ వరంగల్ సందర్శన సందర్భంగా కూడా ప్రజలు ఇదే విషయాన్ని పదే పదే చెప్పారని అన్నారు. దీంతో ప్రజాభీష్టం మేరకు నాలాలపై దురాక్రమణలన్నింటినీ తొలగించాలని నిర్ణయించాం. ఇప్పటికే చాలా వరకు దురాక్రమణల తొలగింపు జరిగింది. ఇంకా మిగిలిన పనులు వేగంగా పూర్తవ్వాలని కమిషనర్ పమేలా సత్పతిని మంత్రి ఆదేశించారు. అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పారు.

## గ్రేటర్ ఎన్నికలపై అభిప్రాయాలు చెప్పండి: ఎన్నికల సంఘం

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో అన్ని పార్టీలకు ఎస్ఈసీ లేఖలు పంపించింది. కోవిడ్ కారణంగా బ్యాలెట్ పేపర్, ఈవీఎంల ద్వారా ఎన్నికల నిర్వహణకు సంబంధించి పార్టీల అభిప్రాయం తెలుపాలని సూచించింది. ఈ నెల 30 లోపు పార్టీలు అభిప్రాయాలు, సూచనలు ఇవ్వాలని లేఖలో పేర్కొంది. 30 తర్వాత ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకోమని ఎస్ఈసీ స్పష్టం స్పష్టం చేసింది.

### మంత్రి కొడాలికి మతి భ్రమించింది: భాను ప్రకాశ్

తిరుపతి,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): తిరుమలలో డిక్లరేషన్ విధానం ఈ నాటిది కాదని టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి, దివంగత అబ్దుల్ కలాం వంటి ఉన్నత వ్యకులు కూడా డిక్లరేషన్ ఇచ్చి వెంకన్నను దర్శించుకున్నారని తెలిపారు. ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హిందూత్వంపై దాడులు పెరిగాయని ఆరోపించారు.వరుస ఘటనలపై దేవాదాయ శాఖ మంత్రి ఎందుకు మాట్లాడడంలేదని భానుప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రి కొడాలి నాని మతి భ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. పేరులోనే వెంకటేశ్వరుడిని పెట్టుకుని.. వెంకన్నను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తులు మనోభావాలను దెబ్బ తీసేలా మాట్లాడుతున్న కొడాలి నానిపై సిఎం జగన్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే.. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆందోళనలను ఉధృతం చేస్తుందని భానుప్రకాష్ రెడ్డి అన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ,ఉపాధి

## -పరిశ్రమ కోసం స్థలపరిశీలన చేసిన ఎమ్మెల్యే

యాదాద్రి భువనగిరి,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. తమ నియోజకవర్గంలో వివిధ పరిశ్రమల కోసం పనిచేస్తున్నామని ఆమె అన్నారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని 72 సర్వే నెంబర్ లో గల స్థలాన్ని కలెక్టర్ అనితారామచంద్రన్ తొ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు త్వరితగతిన స్థలాన్ని సేకరించి పూర్తి నివేదిక అందించాలన్నారు. గ్రామాల్లోని ఆసక్తిగల యువత చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భూపాల్ రెడ్డి, ఎంపీపీ సుశీల, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కరువు రక్కసితో అల్లాడిపోతున్న ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే జీవిత లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.. ఆ క్రమంలోనే 2014 ఎన్నికల్లో ప్రధానంగా చెరువులను బాగు చేసి కరువు రూపుమాపుతానన్న నినాదాన్నే జనంలోకి తీసుకెళ్లాను. గెలిచాక 'మిషన్ కాకతీయ' పథకంలో నాలుగు విడుతలుగా రూ.23.21కోట్లతో 535 చెరువులను ఆధునీకరించి పూర్వ వైభవం తీసుకువచ్చామని అన్నారు. 2018 ఎన్నికల్లో కూడా సాగు నీటి నినాదంతోనే జనంలోకి వెళ్లాను. ఇచ్చిన మాట ప్రకారం గోదావరి జలాలను తీసుకొచ్చాను. ఇప్పుడు పరిశ్రమలను కూడా తీసుకుని వస్తామని అన్నారు.

# రైతులకు పంటలు ధరలు నిర్ణయించుకునే అధికారం

## అగ్రి బిల్లుతో అన్నదాతల కలను సాకారం చేసిన మోడీ స్వామినాధన్ చెప్పిందే మోడీ చేశారు: సోము

విజయవాడ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): పార్లమెంటులో మోదీ తీసుకువచ్చిన వ్యవసాయ బిల్లు రైతులకు వరం అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. విపక్షాల ఆరోపణల్లో వసలేదన్నారు. స్వామినాధన్ సిఫార్సులను ఈ బిల్లు ద్వారా అమలు చేయవచ్చన్నారు. రైతులకు మార్కెట్‌- స్వేచ్ఛ ఉండాలని ఎప్పటినుంచో కోరుతున్నారని అన్నారు రైతు తాను పండించిన పంట అమ్ముకునే అవకాశాన్ని మోదీ కల్పించారు. సినిమాల్లో చూసిన రైతు స్వేచ్ఛకు మోదీ నిజంగా చట్ట బద్ధత కల్పించి చూపారు. గతంలో కంటే రైతుకు గిట్టుబాటు ధర కూడా రెట్టింపు వస్తుందని సోము వీర్రాజు తెలిపారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా సోము వీర్రాజు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం తొలిసారి బీజేపీ రాష్ట్ర పదాధికారుల, జిల్లాల అధ్యక్షులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై సోము వీర్రాజు దిశానిర్దేశం చేశారు. ఈ భేటీలో పార్టీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ.. 'బీజేపీ ఒక లక్ష్యాన్ని పెట్టుకుని ఏపీలో పని చేస్తుంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో పాటు, అభివృద్ధి లక్ష్యంగా మనం పని చేస్తున్నాం. వాజ్‌పేయి ఆధ్వర్యంలో 'సమృద్ భారత్' పేరుతో అభివృద్ధి చేశారు. మనం 'సమృద్ ఆంధ్ర' పేరుతో ముందుకు సాగుతాం. అనేక రకాల కోణాల్లో ఏపీ అభివృద్ధి చెందాలనేదే బీజేపీ ఆలోచన. సురక్ష ఆంధ్రప్రదేశ్ పేరుతో దేశంలోనే ఆదర్శంగా ఉండేలా ఏపీని తయారు చేస్తాం. 'వికసిత వికాస్' పేరుతో... వికసించే ఆంధ్రాగా తీర్చిదిద్దేలా ఈ పదాధికారుల సమావేశం స్వీకరిస్తుంది అని భావిస్తున్నాను' అని సోము వీర్రాజు అన్నారు. అన్ని వర్గాల వారు అభివృద్ధి చెందేలా కార్యక్రమాలు ఉండాలి. ఏపీలో 24 గంటలూ విద్యుత్‌ని తీసుకువచ్చాం. కోటి నలభై లక్షల గృహాల్లో కరెంట్ కోత అనేది లేదు. అదే బీజేపీ మంచి పాలనకు నిదర్శనంగా నిలుస్తుంది. నిర్విరామమైన కార్యక్రమాలు, పోరాటాలతో ముందుకు సాగుదామి పిలుపునిచ్చారు.

# గ్రేటర్‌లో లక్ష ఇళ్ల పేరుతో డ్రామాలు

## ఎక్కడ కట్టారో చూపమంటే జారుకున్నారు ప్రజలను మరోమారు మోసం చేస్తున్న మంత్రులు మండిపడ్డ భట్టి తదితర కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేస్తున్నామంటూ టీఆర్ఎస్ ప్రభుత్వం అసత్య వ్యాఖ్యలు చేస్తోందని,ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని సిఎల్పి నేత మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ కట్టారో చూపమంటే ప్రభుత్వం జారుకుందని అన్నారు. మంగళవారం ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ఇళ్ల జాబితా తప్పుల తడకగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో 1,824 ఇళ్లు కట్టామని ప్రభుత్వం చెప్పిందని, అయితే ఒక్క ఇల్లు కూడా కట్టలేదని అన్నారు. అంతేకాదు జూబ్లీహిల్స్‌లోని రెండు ప్రాంతాల్లో 226 ఇళ్లు కట్టినట్టు ప్రభుత్వం చెప్పిందని, అందులోనూ ఎన్నో అవకతవకలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ప్రతి అర్బన్ నియోజకవర్గానికి 10 వేల చొప్పున ఇళ్లు నిర్మిస్తామని 2016లోనే సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. గ్రేటర్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఇంకెప్పుడు 2.4లక్షల ఇళ్లు కడుతుందని భట్టి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే లక్ష ఇళ్లు కట్టామని తప్పుడు లెక్కలు చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ప్రజలను తప్పుదోవ పట్టించి గ్రేటర్ ఎన్నికల్లో లబ్దిపొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇదిలావుంటే టీఆర్ఎస్‌పై రాజ్యసభ మాజీ ఎంపీ వీహెచ్ తనదైన శైలిలో విమర్శలు చేశారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై పేదలను, బడుగులను టీఆర్ఎస్ మోసం చేస్తోందని మండిపడ్డ ఆయన.. రానున్న ఎన్నికల్లో మళ్లీ మోసం చేస్తారని హెచ్చరించారు. ఎవడొచ్చినా.. ఏ టీఆర్ఎస్ నాయకుడొచ్చినా.. బస్తీల్లోకి రానీయొద్దని తెలిపారు. బడుగుల చేతుల్లోనే ఇప్పుడు ఉంది. ఈసారి ఓటెయ్యం అని చెప్పండి. వర్షాలొస్తే కూలిపోయే ఇండ్లు. మళ్లీ కట్టిస్తామని ఆనాడు చెప్పారు. చూస్తే తెలుస్తుందని.. చివరికి పునాది రాళ్లు కూడా వీకేశారు. ప్రజలను పోలీసులు అడ్డుకోవద్దని... నేతలను నిలదీసే అవకాశం ఇవ్వాలని వీహెచ్ వ్యాఖ్యానించారు. మరోవైపు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం వ్యవహారంపై టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ నాంపల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్లు కడతామని 2015 డిసెంబర్ 17న అప్పటి డిప్యూటీ సీఎం మహ్మద్ ఆలీ, హోంమంత్రి నాయని నరసింహారెడ్డి ఫౌండేషన్ వేశారని చెప్పారు. ఇప్పుడు 2020.. అంటే ఐదేళ్లు అయినా నిర్మాణం జరగలేదని ఆయన తెలిపారు. ఇక్కడ 518 కుటుంబాలు ఉన్నాయని, ఈ ప్రాంతంలో అన్నిఇళ్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయని, ఇటీవల కురిసిన వర్షాలకు గోడ కూలి ముగ్గురు ఆడిపిల్లలు చనిపోయారని అన్నారు. ఘటనపై కలెక్టర్ వద్దకు వెళితే ఇళ్లు కట్టలేమని, బాధితులకు పరిహారం ఇస్తామని చెప్పారన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి తన చేతిలో ఏమీ లేదని, ప్రభుత్వాన్నే అడగాలని చెప్పారని ఫిరోజ్ ఖాన్ అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రజలకు అబద్ధాలు చెప్పి మోసం చేస్తున్నారని, నాంపల్లిలో ఎన్ని ఇళ్లలు కట్టారో చూపించాలని ఆయన ప్రభుత్వాన్ని సవాల్ చేశారు. ఇళ్లు కట్టినట్లు చూపిస్తే తాను రాజకీయ సన్యాసం చేస్తానన్నారు. లక్ష ఇళ్లు ఎక్కడున్నాయో చూపించమంటే.. వేరే ఇళ్లు చూపిస్తున్నారని మండిపడ్డారు. ఓట్లు వేయించుకుని ఐదేళ్ల నుంచి ప్రజలను మోసం చేస్తున్నారని ఫిరోజ్ ఖాన్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

# మంత్రి కెటిఆర్ చిల్లర రాజకీయాలు మానాలు

## కరోనా సాయంపై తప్పుడు లెక్కలు చెబుతారా 7వేల కోట్లు కేంద్రం అందిస్తే 290 మాత్రమే అని అబద్దాలు కెటిఆర్ ట్వీట్‌పై మండిపడ్డ బిజెపి ఎంపి అర్వింద్

న్యూఢిల్లీ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): మంత్రి కెటిఆర్ చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కరోనా వైరస్ నియంత్రణకు రూ.290 కోట్లు మాత్రమే ఇచ్చారని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారని.. అది అబద్ధమని అన్నారు. కేటీఆర్‌కి నల్లికుట్ల రామారావు అని పేరు పెడితే బాగుండని అరవింద్ అన్నారు. తెలంగాణకు కేంద్రం రూ.7 వేల కోట్లు ఇచ్చిందని చెప్పారు. అబద్ధాలు చెప్పడంలో మంత్రి కేటీఆర్.. సీఎం కేసీఆర్‌ని మించిపోయారన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఎంపీ అరవింద్ అన్నారు. కేటీఆర్‌కి మునిసిపల్ బుద్ధులు పోలేదని.. ఆయనో పెద్ద దద్దమ్మ అని అరవింద్ అన్నారు. కేటీఆర్ ఇంకా చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని ఆయన అన్నారు. 'రాష్ట్రానికి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వివిధ పథకాల కింద కేంద్రం ఏడు వేల కోట్లు కేటాయించిది. కానీ కేటీఆర్ మాత్రం కేవలం రూ. 290 కోట్లే కేటాయించిదని తప్పుడు ట్విట్ చేశాడు. ఆయన చెప్పిన రూ. 290 కోట్లు రాష్ట్రానికి కేంద్ర ఆరోగ్య శాఖ ఇచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్‌లు శవాల మీద పేలాలు ఏరుకునే రకం. కల్వకుంట్ల తారకరామారావు పేరు తీసేసి.. నల్లికుంట్ల తారకరామారావు అని పెట్టాలి. కేటీఆర్ అబద్దాలు చెప్పడంలో కేసీఆర్‌ని మించి పోతున్నాడు. కేంద్రం పంపిన వెంటిలేటర్‌లను కూడా ఉపయోగించుకోలేదు. కోవిడ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తున్నదో ప్రజలకు తెలుసు' అని ఆయన అన్నారు.



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరువాసి సాయి చరణ్ చవాన్‌కు బీసీ-ఎ కింద మొదటి కుల ధ్రువపత్రాన్ని అందచేస్తున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

# కొత్తగా చేరిన కులాల వారికి సర్టిఫికెట్

## -ఆలూరి వాసికి అందచేసిన మంత్రి గంగుల

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం అణగారిన వర్గాలు, పేదల పక్షాన నిలిచింది. అన్ని కులాలు, మతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూనే ఎన్నో ఏండ్లుగా గుర్తింపునకు నోచుకోని 17 కులాల వారిని బీసీల జాబితాలోకి చేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుంది. ఈ క్రమంలో బీసీల జాబితాలో కొత్తగా చేరిన 17 కులాలకు ధ్రువపత్రాలు జారీ అయ్యాయి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు వాసి సాయి చరణ్ చవాన్‌కు బీసీ-ఎ కింద మొదటి కుల ధ్రువపత్రాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అందజేశారు. బీసీ 'ఏ' గ్రూపులో అద్దెపువారు, బాగోతుల, బైల్ కమ్మర, ఏనూ టి, గంజికూటి వారు, గౌడ జెట్టి, కాకి పడగల, పటంవారు/ మాసయ్యలు, ఓడ్, సన్నాయిల, క్షత్రియ రామజోగి, తెరచీరల,

తోలుబొమ్మలాటవారు/బొప్పల కులాలను చేర్చారు. బీసీ 'డీ' గ్రూపులో అహిర్ యాదవ్, గొవిలి, కుల్లకడగి, సారోల్లు కులాలను చేర్చారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఈ 17 కులాలకు చెందిన 9,839 కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. జీవో ద్వారా 17 కులాలను బిసి జాబితాలో చేర్చడం జరిగింది. ఈ

జాబితాలో చేరిన ఆలూరు గ్రామం, చేవెళ్ల మండలం, రంగారెడ్డి జిల్లాకు చెందిన శ్రీ కె. సాయి చరణ్ చవాన్ కు మొదటి కుల ధ్రువీకరణ పత్రం అందజేయడం జరిగింది

# జననేతకు ఘనస్వాగతం...

## - స్వదేశానికి విచ్చేసిన టి ఆర్ కె

వేములవాడ, సెప్టెంబర్ 22 (నేటినిజం ప్రతినిధి): నలుగురికి సహాయం చేయాలనే ఉద్దేశంతో టి ఆర్ కె ట్రస్టును నెలకొల్పి



అన్నార్తుల ఆకలి తీర్చి, ఆపదలో ఉన్న వారికి చేయూత అందించి, లాక్ డౌన్ లో ఉపాధి కోల్పోయిన వారికి సహాయం చేసి జన నేతగా గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ ఎన్నారై, టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ స్వదేశానికి మంగళవారం విచ్చేశారు. వేములవాడకు చేరుకున్న ఆయనకు టి ఆర్ కే ట్రస్ట్ వర్కింగ్ టీం సభ్యులు ఘనంగా శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అలాగే తన చిన్ననాటి స్నేహితులైన ప్రముఖ వ్యాపారస్తుడు నార్ల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పైడి శ్రీనివాస్ లు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి త్రిశూలాన్ని అందజేసి రాజన్న ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ లు కుమ్మరి శంకర్, మొట్టల మహేష్ కుమార్, కార్యదర్శి నాయిని శేఖర్, ట్రస్టు వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఉద్యోగం పోయిందన్న విషాదం

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

యాదాద్రి,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అభిలాష్ అనే ఓ యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెంగళూరుకు చెందిన ఓ కంపెనీలో అతను ఉద్యోగం చేస్తున్నాడు. కరోనా వైరస్ నేపథ్యంలో కొంత కాలంగా తన ఇంటివద్ద నుంచే వర్క్ ఫ్రమ్ హోం ద్వారా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే రెండు రోజుల్లో అతన్ని కంపెనీ ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం అందించింది. ఉద్యోగం పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన అభిలాష్ మణికట్టును కత్తితో కోసుకొని అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడి మృతిపై తల్లిదండ్రులు, కుటంబసభ్యులు కన్నీరుమున్నీరు అవుతన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నారు.

# దసరాలోపు వేదికల నిర్మాణం: కలెక్టర్

అదిలాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): జిల్లాలో నిర్మిస్తున్న రైతువేదికల నిర్మాణం దసరా లోపు పూర్తి చేయాలని కలెక్టర్ స్విక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం ఉట్నూర్ మండలం షాంపూర్, నర్సాపూర్ గ్రామాల్లో రైతు వేదికల నిర్మాణ పనులు కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. జిల్లాలో 105 వేదికల నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. గడువులోగా రైతువేదికల నిర్మాణాలు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. రైతువేదికల నిర్మాణాలతో రైతులు తమ సమస్యలను చర్చించి పరిష్కరించేకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని కాపాడిన గంగాధర పోలీసులు

కరీంనగర్, సెప్టెంబర్ 22 (నేటినిజం ప్రతినిధి): ఆత్మహత్యకు సిద్ధమై వెళుతున్న వ్యక్తిని నిలువరించి రక్షించారు గంగాధర పోలీసులు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.




కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన పోతర్ల రామాంజనేయులు (50) సోమవారం నాడు రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటానని వెళ్ళిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఊర్లో మొత్తం గాలించినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. గంగాధర వైపు వెళ్లినట్లు అనుమానించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఎస్ఐ టి వివేక్ ఆధ్వర్యంలో గాలింపు చేపట్టారు. గంగాధర క్రాస్ రోడ్డు వద్ద హెడ్ కానిస్టేబుల్ కె గంగరాజు, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ పోలీసులకు తన్ధపడ్డాడు. వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకొని వివరాలు సేకరించారు. అనంతరం అతని కుమారులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, అతని కుమారుల సమక్షంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన రామాంజనేయులు ను అప్పగించారు. వ్యక్తి ప్రాణాలను రచించిన ఎస్ఐ టి వివేక్, హెడ్ కానిస్టేబుల్ గంగరాజు, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ యం రవి, హోంగార్డు చంద్రశేఖర్ లను కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్ రెడ్డి అభినందిస్తూ రివార్డులను ప్రకటించారు.

# కల్పవృక్ష వాహనంపై ఊరేగిన మలయప్ప స్వామి

## -తలపాగా, జాటీతో గోవుల గోపన్నగా దర్శనం

తిరుమల,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన మంగళవారం ఉదయం శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీ మలయప్పస్వామివారు కల్పవృక్ష వాహనంపై ఊరేగారు. తలపాగా, జాటీతో గోవుల గోపన్నగా దర్శనమిచ్చారు. క్షీరసాగరమథనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టు నీడన చేరిన వారికి ఆకలిదప్పుల ుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. అలాకాక కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి నాలుగో రోజు ఉదయం శ్రీవారు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీ చిన్నజీయర్‌స్వామి, ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, బోర్డు సభ్యులు డిపి.అనంత, శివకుమార్, శేఖర్‌రెడ్డి, గోవిందహరి, అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డి, సివిఎస్వో గోపినాథ్ జెట్టి, ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, పేష్కార్ జగన్‌మోహనాచార్యులు పాల్గొన్నారు.

# గ్రేటర్ ఇళ్లపై కాంగ్రెస్ నేతల అనవసర విమర్శలు

## ఇల్లు చూసే ఓపికే లేకపోయిందన్న మంత్రి తలసాని భట్టి తీరుపై మండిపడ్డి మంత్రి

హైదరాబాద్ ,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మరోమారు పండిపడ్డారు. ప్రభుత్వం పేదలకు ఇల్లు కట్టించిందా లేదా అన్నది ముఖ్యమని అన్నారు. తామె చెప్పినట్లుగా గ్రేటర్ పరిధిలో అందుబాటులో ఉన్న జాగాల్లో లక్ష ఇల్లు కట్టించామని అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్‌లో మంత్రి తలసాని మీడియాతో మాట్లాడుతూ గాంధీ భవన్ దగ్గర పేదల ఇండ్లను కూల్చిన ఘనత కాంగ్రెస్ నేతలది అని మంత్రి ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్‌లోని కమలానగర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తుంటే కాంగ్రెస్ నేతలు కోర్టులో కేసు వేశారు అని గుర్తు చేశారు. నాంపల్లిలో మేం కట్టింది ఒకదగ్గర.. మీరు చూసింది మరో దగ్గర అని తెలిపారు. జీహెచ్ఎంసీలో ఎక్కడ ఇండ్లు కడుతున్నామో తెలుసుకుని వెళ్లాలని కాంగ్రెస్ నేతలకు సూచించారు. హైదరాబాద్‌లో లక్ష ఇండ్లు ఉన్నాయి.. మీకు జాబితా ఇచ్చామని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్లపై మాట్లాడేందుకు కాంగ్రెస్ నేతలకు అర్హత లేదని తేల్చిచెప్పారు. పేదవాడికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టిస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదని స్పష్టం చేశారు. కరోనా సమస్యలున్నా ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. ఈ ఇండ్ల నిర్మాణం ఒక్క రోజులో పూర్తి కాదు అని మంత్రి చెప్పారు.సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి కేటీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. అధికారంలో ఉండగా భట్టి విక్రమార్కను కాంగ్రెస్ నాయకులు దగ్గరకు రానివ్వలేదు. కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు అతీగతీ లేదు. జీహెచ్ఎంసీలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీకి 150 మంది అభ్యర్థులు ఉన్నారా? అని మంత్రి తలసాని ప్రశ్నించారు.

# కెసిఆర్ పాలనలో ఆంధ్రా కాంట్రాక్టర్లే బాగుపడ్డారు

## -సిద్దిపేట కలెక్టరేట్ ముట్టడిలో వివేక్

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని మాజీ ఎంపీ వివేక్ ఆరోపించారు. ఒకవైపు టీఆర్ఎస్ వాళ్ళు అగ్రికల్చర్ బిల్లు పైన నిరసన తెలిపితే పోలీసు వాళ్ళు వారికి రక్షణ ఇస్తున్నారన్నారు. ప్రాజెక్టులకు రీడిజైన్ పేరిట సీఎం కేసీఆర్ కమిషన్ దోచుకోవడానికి మూడు లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. రాష్ట్రానికి మూడు లక్షల కోట్లు అప్పు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వివేక్ పేర్కొన్నారు. ప్రజల నుంచి డబ్బులు దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తీసుకువచ్చాడని విమర్శించారు. రాష్ట్రాన్ని కేసీఆర్ దోచుకు తింటున్నాడని.. కొడుకు, బిడ్డకు పామ్ హౌస్ కట్టిస్తున్నాడని ఆరోపించారు. కేసీఆర్‌ది తుగ్లక్ పాలన అని పేర్కొన్నారు. పార్లమెంట్ కోసం 800 కోట్లు ఖర్చు చేస్తే, సచివాలయం కోసం వెయ్యి కోట్లు పెట్టడం కాంట్రాక్ట్ వాళ్ళ జేబులు నింపడం కోసమేనని వివేక్ ఆరోపించారు. కాంట్రాక్టర్లకు దోచి పెట్టడుకే సీఎం కేసీఆర్ ప్రజలను దోపిడీ చేస్తున్నారని వివేక్ ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, ఒఖాపై ప్రభుత్వ తీరుకు నిరసనగా బీజేపీ నేతలు సిద్దిపేటలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడిలో ఆయన పాల్గొన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలపై కేసీఆర్ మాట తప్పారని ఆయన ఫైర్ అయ్యారు. టీఆర్ఎస్ పాలనలో ఆంధ్రా కాంట్రాక్టర్లు, కల్వకుంట్ల కుటుంబీకులే బాగుపడ్డారని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని వివేక్ విమర్శించారు. ఆందోళన చేస్తున్న బీజేపీ నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు సిద్దిపేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. 'రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తుంది. ప్రజలకు డబుల్ బెడ్ రూమ్స్ ఆశ పెట్టి ఇవ్వడం లేదు. కరోనా సమయంలో ప్రజలను పీడించడానికే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను తీసుకొచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్ట్స్ పేరుతో ప్రజల సొమ్ము దోచుకుతింటుంది.

# నిరుపేదల సంక్షేమం లక్ష్యం: ఎమ్మెల్యే

వరంగల్ రూరల్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని వర్దన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేష్ అన్నారు. అనేక పథకాలతో వారికి అండగా నిలిచిందన్నారు. వర్ధన్నపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 119 మంది లబ్దిదారులకు కోటి 19 లక్షల 13 వేల రూపాయల విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేదింటి ఆడబిడ్డల పెండ్లిండ్లు భారం కావొద్దనే ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రవేశపెట్టి ఆడపిల్లల తల్లిదండ్రులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం పది మంది లబ్దిదారులకు రూ. 1.97 లక్షల విలువ చేసే సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


CHANGE OF NAME

**Old Name:** Tillari. Kanaka Dhurga W/o. Late T. Koteshwar Rao H.NO. 16-11-133/1 Moosarabagh, Malakpet Hyderabad. Cell No.9701319996.
**New Name: T. KALAVATHI**


# యాదాద్రి స్టేషన్‌గా మారిన రాయగిరి

## -కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

యాదాద్రి,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి రైల్వేస్టేషన్ పేరును యాదాద్రి రైల్వే స్టేషన్‌గా మార్పు చేశారు. ఇకనుంచి ఈ స్టేషన్ యాదాద్రిగా వెలుగొందనుంది. ఈ మేరకు కేంద్రం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతున్న విషయం తెలిసిందే. అయితే యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు పూర్తయితే దేశ నలుమూలల నుంచి రోజూ లక్ష మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ క్రమంలో ఘట్‌కేసర్ వరకు ఉన్న ఎంఎంటీఎస్‌ను రాయగిరి వరకు పొడిగించాలని, దీంతో పాటు రాయగిరి రైల్వేస్టేషన్ పేరును యాదాద్రి రైల్వే స్టేషన్‌గా మార్చాలని 2016లో ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్రాన్ని కోరారు. ఈ క్రమంలో ఎంఎంటీఎస్‌ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్ పేరును కూడా మార్పు చేసింది. ఇందుకు సంబంధించి ఈనెల 18న దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా గత సంవత్సరం సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో పేరు మారుస్తూ ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టకు రాయగిరి రైల్వే స్టేషన్ మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. సికింద్రాబాద్ -ఖాజీపేట సెక్షన్‌లో భువనగిరి వంగపల్లి మధ్యన రాయగిరి రైల్వే స్టేషన్ ఉంది. రాయగిరిలో రైలు దిగి యాదగిరిగుట్టకు భక్తులు వెళ్తారు. ఇప్పటికే ఈ ప్రాంతం అంతా బాగా అభివృద్ధి చెందింది. రాయగిరి రైల్వే స్టేషన్ పేరు యాదాద్రి రైల్వే స్టేషన్‌గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌కు పేరు మార్పుతో యాదాద్రి దేశ వ్యాప్తంగా ప్రాముఖ్యతను సంతరించుకుంటుందన్నారు. 2016లో యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ కేంద్రం మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.

# రెండోరోజూ లంచావతారులను విచారించిన ఎసిబి

హైదరాబాద్,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): రూ. కోటి 12 లక్షల లంచం కేసులో ఏసీబీ అధికారులు రెండో రోజు మంగళవారం ఐదుగురు నిందితులను ప్రశ్నించారు. ఆర్డీవో అరుణారెడ్డిని చంచల్‌గూడ జైలు నుంచి ఏసీబీ కార్యాలయానికి తరలించారు. అడిషనల్ కలెక్టర్ నగేష్‌తోపాటు మరో నలుగురిని విచారిస్తున్నారు. మరోవైపు నగేష్ బ్యాంక్ లాకర్‌పై ఇంకా చిక్కుముడి వీడలేదు. రూ. 40 లక్షలు ఎక్కడున్నాయన్నదానిపై ఏసీబీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో మాజీ కలెక్టర్ నగేష్ ప్రమేయం ఎక్కువగా ఉందని ఆరోపణలు వస్తున్నాయి.

# తేనెటీగల దాడిలో డివిజనల్ ఇంజనీర్ మృతి

కర్నూలు,సెప్టెంబర్22(ఆర్ఎన్ఎ): జిల్లాలోని బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ వద్ద విషాదఘటన చోటుచేసుకుంది. డివిజనల్ ఇంజనీర్ భానుప్రకాష్ పై తేనెటీగల దాడి చేశాయి. తేనెటీగల దాడిలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. హెడ్ రెగ్యులేటర్ వద్ద ఎస్ఆర్‌బీసీ గేట్ల తనిఖీ సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.


Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.